# యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ (UPF)

1-9-52/E/3, రాంనగర్, హైదరాబాద్ - 500 020. (T.S.) INDIA. Ph.: 040-27624030, 27624031

# దెబోరా స్వరం

సంపుటి : 9 సంచిక : 1 | జనవరి - ఫిబ్రవరి 2016 | విడి ప్రతి వెల రూ. 5/-


## నిన్ను ఏమాత్రమును విడువను, నిన్ను ఎన్నడును ఎడబాయను. – హెబ్రీ 13:5



**జాయ్ చెరియన్**

**సంపాదకురాలి కలము నుండి...**

'దెబోరాస్వరం' పాఠకులకందరికి క్రీస్తు నామములో శుభములు.

ఈ నూతన సంవత్సరములో దేవుడు మనకందరికి ఈ వాగ్దానము ఇస్తున్నాడు. **"నిన్ను ఏమాత్రమును విడువను, నిన్ను ఎన్నడును ఎడబాయను."**

– హెబ్రీ 13:5

(I will not leave you I will not forsake you)

ఎవరు నిన్ను మరచినా, ఎవరు నిన్ను విడిచిపోయినా నేను నిన్ను విడువను అని దేవుడు వాగ్దానము చేస్తున్నాడు. సీయోను కుమారి – ప్రభువు నన్ను మరచిపోయాడు నా ప్రార్థనలకు జవాబివ్వడము లేదు. నేను ఇంతగా ప్రభువుకు సమీపముగా జీవిస్తున్నాను అయినా ప్రభువు నా మొఱ్ఱ ఆలకించడము లేదని అనుకుంటుంది. వాక్యము ధ్యానిస్తున్న ప్రియవిశ్వాసీ, నీవు కూడ ఈ విధముగా అనుకుంటున్నావా? దేవుడు నన్ను మరచిపోయాడు, నా ప్రార్థనలు వినడములేదు, నా చెయ్యి విడిచిపెట్టాడని. ఆయన నిన్ను విడువడు, ఎన్నడును ఎడబాయడు. ఆయన అరచేతులలో నీవు చెక్కబడియున్నావు. ఆయన కనుదృష్టి నీ మీద ఉందని మరచిపోకు. ఏ స్త్రీ అయినా గర్భమున పుట్టిన బిడ్డను మరచిపోతుందా? వారయినా మరచుదురు గాని నేను నిన్ను మరువను అని దేవుడు వాగ్దానము చేస్తున్నాడు. నీ ప్రాకారములు నిత్యము నా యెదుట ఉన్నవి.

**"అయితే సీయోను – యెహోవా నన్ను విడిచిపెట్టియున్నాడు. ప్రభువు నన్ను మరచియున్నాడని అనుకొనుచున్నది. స్త్రీ తన గర్భమున పుట్టిన బిడ్డను కరుణింపకుండ తన చంటిపిల్లను మరచునా? వారైన మరచుదురు గాని నేను నిన్ను మరువను. చూడుము నా యరచేతులమీదనే నిన్ను చెక్కియున్నాను నీ ప్రాకారములు నిత్యము నాయెదుట నున్నవి."** – యెషయా 49:14-16

కొందరు తల్లులు బిడ్డను కంటారు ఏ మాత్రము దయ, కనికరము లేకుండ చెత్తకుండీలో పడవేస్తారు. కొందరు తల్లులు బిడ్డను వదిలివేసి వెళ్లిపోతారు. కొందరు కసాయి తల్లులు బిడ్డలను చంపివేస్తారు. అందుకే వాక్యములో ఏ స్త్రీ అయినా తన గర్భమున పుట్టిన బిడ్డను మరచిపోతుందా? వారయినా మరచుదురుగాని నేను నిన్ను మరువను విడువను ఎడబాయనని దేవుడు వాగ్దానము చేస్తున్నాడు. ఆయన నిత్యము నిన్ను కాపాడుతున్నాడు. నిన్ను కాపాడువాడు కునకడు నిద్రపోడు. ఆయన నీ రాకపోకలయందు నిన్ను కాపాడుతున్నాడు నీ ప్రాణమును కాపాడుతున్నాడు. నీకు నిత్యము తోడుగా ఉండి నడిపిస్తున్నాడు. నీ మీద దృష్టియుంచి నీకు ఆలోచన చెప్పి నీవు నడువవలసిన మార్గమును నీకు ఉపదేశిస్తున్నాడు.

పరిశుద్ధ గ్రంథములో ఎన్నో ప్రశస్తమైన వాగ్దానములున్నాయి. మన పితరులైన అబ్రాహాము, ఇస్సాకు, యాకోబులకు దేవుడు ఎన్నో వాగ్దానములిచ్చి వారిని నడిపించాడు. ఆ వాగ్దానములు నాడు వారు పొందితే నేడు యేసుక్రీస్తు నందు విశ్వాసముంచి రక్షింపబడిన వారికందరికి వర్తిస్తాయి. మనము రక్షింపబడిన జనము. యేసుక్రీస్తు రక్తమందు కడుగబడి పవిత్రులుగా పరిశుద్ధ జనముగా చేయబడ్డాము. పరిశుద్ధ గ్రంథములోని వాగ్దానములన్నీ దేవుడు నీ జీవితములో నెరవేరుస్తాడని నమ్మాలి. దేవుని వాగ్దానములు ఎన్ని ఉన్నను అవి అన్నియు యేసుక్రీస్తునందు అవును ఆమేన్ అన్నట్లుగానే ఉన్నవని పౌలు భక్తుడు అంటున్నాడు.

**"దేవుని వాగ్దానములు ఎన్నియైనను అన్నియు క్రీస్తునందు అవునన్నట్టుగానే యున్నవి గనుక మనద్వారా దేవునికి మహిమ కలుగుటకై అవి ఆయనవలన నిశ్చయములై యున్నవి."** – 2 కొరింథీ 1:20

నిశ్చయముగా నేను నిన్ను ఆశీర్వదిస్తాను అని వాగ్దానమిస్తే ఆశీర్వదిస్తాడు, నీ సంతతిమీద నా ఆత్మను కుమ్మరిస్తానంటే కుమ్మరిస్తాడు. నిన్ను గొప్ప చేయ మొదలు పెట్టెదను అంటే గొప్పచేస్తాడంతే. నిన్ను స్వస్థపరుస్తాను అంటే స్వస్థపరుస్తాడు ఎందుకంటే దేవుని మాటలన్నియు సత్యము నిత్యములై యున్నవి, ఆయన మాట సెలవిస్తే దానిని తప్పక నెరవేరుస్తాడు, మన పితరులకిచ్చిన వాగ్దానములు నేడు మనము స్వతంత్రించుకుంటున్నాము. మన పితరులకు చేసిన శుభవాగ్దానములన్నిటిలో ఒక్కటికూడ తప్పిపోకుండ అన్నీ నెరవేరాయని వాక్యములో చెప్పబడింది.

**"– తాను చేసిన వాగ్దానమంతటినిబట్టి ఇశ్రాయేలీయులగు తన జనులకు నెమ్మది దయచేసిన యెహోవాకు స్తోత్రము కలిగియుండును గాక. తన దాసుడైన మోషేద్వారా ఆయన చేసిన శుభవాగ్దానములో ఒక మాటైన తప్పి పోయినది కాదు. కాబట్టి మన దేవుడైన యెహోవా మనలను వదలకను విడువకను, మన పితరులకు తోడుగా నున్నట్లు మనకును తోడుగా ఉండి తన మార్గములన్నిటిని అనుసరించి నడుచుకొనునట్లుగాను, తాను మన పితరులకిచ్చిన ఆజ్ఞలను కట్టడలను విధులను చేకొనునట్లుగాను, మన హృదయములను తనతట్టు త్రిప్పుకొనును గాక."** – 1 రాజులు 8:56-58

ప్రభువు మనలను **"ఏ మాత్రమును విడువను, ఎన్నడును ఎడబాయను"** అనే వాగ్దానము ద్వారా బలపరుస్తున్నాడు. ప్రభువు నాకు సహాయుడు, నరమాత్రులు నాకేమి చేయగలరు? నేనెందుకు వారికి భయపడాలి? అని అంటున్నాడు.

ధనాపేక్ష లేనివారై మీకు కలిగినవాటితో తృప్తి పొందియుండాలని వ్రాస్తున్నాడు. అంటే నీవు గొప్పగా దీవింపబడకూడదని అర్థముకాదు గాని ధనముమీద ఆశకంటే దేవునిమీద ఆశ కలిగియుండాలి, దేవుని కలిగి జీవించాలి. దేవుని రాజ్యము నీతిని మొదట వెదకాలి. అప్పుడు అన్నీ మీకు

అనుగ్రహింపబడతాయి. ఎవరికి యాకోబు దేవుడు సహాయుడగునో ఎవడు దేవుడైన యెహోవామీద ఆశ పెట్టుకొనునో ఆ నరుడు ధన్యుడు కాబట్టి ధనాపేక్ష కలిగియుండకూడదు. ఈ క్రొత్త సం॥లో అడుగు పెడుతున్నాను, చాలీచాలని జీతముతో నా కుటుంబమెలాగు పోషింపబడుతుంది? ఏ విధముగా ఈ ఖర్చులన్నీ ఎదుర్కోవాలని ఆలోచిస్తున్నావా? ఎవరో ఏదో కీడు చేస్తారని భయపడుతున్నావా? ఈ అనారోగ్యము ఎప్పుడు నన్ను విడిచిపోతుందని అనుకుంటున్నావా? ఇలాంటి చీకటి చింతలన్నియు తొలగించుకోవాలి. ఈ నూతన సం॥లో నీ మనస్సు మారాలి. నీ చిత్తవృత్తియందు మార్పురావాలి. నీవు దేవుని నమ్మాలి, ఆయన వాగ్దానములు నీ పట్ల నెరవేర్చగలడని నమ్మాలి. ఆయన నిన్ను ఎన్నడును విడువడు, ఏ మాత్రము ఎడబాయడు. దేవునికి ప్రార్థన చేయాలి ప్రార్థనకు అసాధ్యమైనది ఏదీ లేదు. దేవునికి సమస్తము సాధ్యము. ఇప్పుడు నీవు కొద్దిగా ఉన్నావేమో గాని దేవుడు నిన్ను తుదకు మహాభివృద్ధిలోనికి తీసికొనివస్తాడు. దేవునికి స్తోత్రము! హల్లెలూయ!

**“ నీవు జాగ్రత్తగా దేవుని వెదకినయెడల సర్వశక్తుడగు దేవుని బతిమాలుకొనినయెడల నీవు పవిత్రుడవై యథార్థవంతుడవైనయెడల నిశ్చయముగా ఆయన నీయందు శ్రద్ధ నిలిపి నీ నీతికి తగినట్టుగా నీ నివాసస్థలమును వర్ధిల్లజేయును. అప్పుడు నీ స్థితి మొదట కొద్దిగా నుండినను తుదను నీవు మహాభివృద్ధి పొందుదువు.”** – యోబు 8:5-7

దేవుని వాగ్దానములు నీలో నేరవేరాలంటే నీలో నీతి ఉండాలి. క్రీస్తనే నీతిని నీవు ధరించాలి. రక్షణ మార్గములోకి రావాలి. దేవుని మాట వినాలి. అప్పుడే దేవుని వాగ్దానములు నీలో నెరవేరుతాయి. నీకు శుభకరమైన ఆనవాలు చూపుతాడు. నిన్ను అభివృద్ధిలోనికి తీసికొనివస్తాడు. నిన్ను తలగా చేస్తాడు కాని తోకగా చేయడు, నీవు పై వాడవుగా ఉంటావుగాని క్రిందివాడవుగా ఉండవు. దేవుని శుభకరమైన వాగ్దానములన్నియు నీకు వర్తించుకోవాలంటే నీలో అవి నెరవేరాలంటే ప్రభువు మార్గములోకి రావాలి. నీ నీతికి తగినట్లుగా నీ నివాస స్థలమును వర్ధిల్లజేస్తాడు. దేవుడే నిన్ను వృద్ధిపరచాలి. దేవుడు వృద్ధిపరచకుంటే నీవు పైకిరాలేవు. నీవు పైకి రావాలంటే దేవుని అనుమతి కావాలి. దేవుని సెలవు లేకుండ ఆహారము తిని తృప్తిగా సంతోషముగా ఎవరుండగలరు? నీవేదో నీ కష్టార్జితముచేత పైకి వస్తానని అనుకుంటున్నావు గాని నిన్ను అభివృద్ధి నొందించేవాడు దేవుడే. సంతుష్టి సహితమైన దైవభక్తి గొప్ప లాభసాధనము నీకు మేలు, సంతోషము తృప్తికలుగజేసేవాడు దేవుడే. **“ పక్షిరాజు యౌవనమువలె నీ యౌవనము క్రొత్తదగుచుండునట్లు మేలుతో నీ హృదయమును తృప్తిపరచుచున్నాడు.”** – కీర్తనలు 103:5. అందుకే దేవునియందు నమ్మికయుంచాలి దేవుని కలిగి జీవించాలి. ఆయన నిన్ను ఎన్నడును విడువడు, ఏ మాత్రమును ఎడబాయడు.

మనము వాహనములు కొనగలము గాని మన రాకపోకలయందు కాపాడేవాడు దేవుడే. నీకు భద్రత కల్పించేవాడు క్షేమముగా నీ గమ్యస్థానము చేర్చువాడు దేవుడే. ఈ మధ్య పేపరులో చదివి ఆశ్చర్యపోయాను. కార్లు తగలబడి పోతున్నాయట. షార్ట్ సర్క్యూట్ వల్లనో దేనివల్లనో తెలియదుగాని కారు తగులబడి అందులో ప్రయాణించేవారు చనిపోతున్నారు. నీవు లక్షల రూ॥లు పెట్టి వాహనము కొనుక్కొని దానిలో ప్రయాణించినా నీకు భద్రత లేదు. భద్రత కల్పించేవాడు దేవుడే. యుద్ధదినమున గుఱ్ఱములను ఆయత్తపరచగలవేమోగాని ఆ యుద్ధములో నిన్ను రక్షించేవాడు, జయము అనుగ్రహించేవాడు దేవుడే. దేవునికి స్తోత్రము. **“యుద్ధదినమునకు గుఱ్ఱములను ఆయత్తపరచుటకద్దు గాని రక్షణ యెహోవా ఆధీనము.”** –సామెతలు 21:31 నేను వాచ్‌నైట్ సర్వీసుకు వెళ్లకముందు ప్రార్థన చేసికొని వెళ్తాను. దేవా, ఎంతో మంది దూర ప్రాంతములనుండి వస్తారు. యౌవనబిడ్డలు దేవుని వాక్యము వినడానికి హాస్టల్స్‌నుండి వస్తారు. తిరిగి వెళ్లేటప్పుడు ఎలాంటి అవాంఛనీయమైన సంఘటనలు జరుగకుండ వారిని కాపాడు. వారికి తొందరగా వాహనములు దొరకాలి. క్షేమముగా వారి గృహాలకు వెళ్లాలి. వచ్చిన వారందరిని భద్రముగా నీవే కాపాడాలి అని ప్రార్థన చేసినప్పుడు దేవుడు నాకు ఒక వాగ్దానమిచ్చాడు. **“ యెహోవా ఇల్లు కట్టించనియెడల దాని కట్టువారి ప్రయాసము వ్యర్థమే యెహోవా పట్టణమును కాపాడనియెడల దాని కావలికాయువారు మేలుకొనియుండుట వ్యర్థమే.”** – కీర్తనలు 127:1. మనలను కాపాడేది పోలీస్‌వారు మిలటరీవారు అని అనుకుంటాము కాని యెహోవా పట్టణము కాపాడనియెడల దాని కావలికాయువారు మేలుకొనియుండుట వ్యర్థమేనని వాక్యము సెలవిస్తుంది. మన హైద్రాబాద్ పట్టణమును ఉగ్రవాదుల దాడినుండి టెర్రరిస్టుల దాడినుండి కాపాడేవాడు దేవుడేనని గ్రహించాలి. నిన్ను నన్ను మనందరిని భద్రముగా కాపాడేవాడు దేవుడే. ప్రమాదకరమైన దినములలో మనము ఉన్నాము. ఊహించనిరీతిలో అనేకులు మరణిస్తున్నారు.

హ్యాపీ న్యూ ఇయర్ అంటూ ఒకరిని ఒకరు విష్ చేసికుంటూ శుభములు పలుకుతున్నాము గాని మరుసటి క్షణము ఏమి సంభవిస్తుందో మనకు తెలియదు. అందుకే దేవుని బిడ్డలు దేశరక్షణకొరకు తప్పకుండ ప్రార్థించాలి. గొప్పదేవుడు మనకున్నాడు. ఆయన మనలను విడువక ఎడబాయక కాపాడుతాడు అనే విశ్వాసము నిరీక్షణ కలిగి జీవించాలి. ప్రభువు నాకు సహాయుడు నేను ఎవరికీ భయపడను అని భక్తుడు అంటున్నాడు. ఈ రోజు శత్రువులు ఏదో కీడు చేస్తారని భయపడుతున్నావా? దేవుని సెలవు లేకుండా నీ తలవెంట్రుకలలో ఒక్కటికూడ నేలకు రాలదు. అందుకే ఎవరికీ, దేనికీ భయపడకుండ దేవునియందు విశ్వాసముంచి ధైర్యముగా ఉండాలి. ఆయన నిన్ను విడువడు, ఎడబాయడని జ్ఞాపకము చేసికోవాలి. ఈ లోకములో ఎల్లప్పుడు నీతో ఎవరు ఉంటారు? గ్యారెంటీలేని లోకము. పిల్లలు చూస్తారని గ్యారెంటీ ఉందా? భార్యాభర్తలు కలిసి ఉంటారని గ్యారెంటీ ఉందా? తల్లిదండ్రులు ఎప్పుడూ నిన్ను చూస్తారని గ్యారెంటీ ఉందా? అన్ని బంధములు బాంధవ్యములు తాత్కాలికమే. అందరూ ఏదో ఒకరోజు నిన్ను విడిచి పోతారు, నీ చేయి విడిచిపెడతారు కాని ఎవరు నిన్ను విడిచినా దేవుడు నిన్ను విడువడు ఎడబాయడు సదాకాలము నీకు తోడుగా ఉంటాడు. నీ చేయి పట్టుకొని నిన్ను నడిపిస్తాడు.

**“నా తలిదండ్రులు నన్ను విడచినను యెహోవా నన్ను చేరదీయును.”** – కీర్తనలు 27:10. కొందరు తల్లిదండ్రులు పిల్లల విషయము శ్రద్ధ చూపించరు. వారి భవిష్యత్తునుగూర్చి పట్టించుకోరు. అలాంటి యౌవనబిడ్డలు నా దగ్గరకు వచ్చి ఏడుస్తారు. వారికొరకు ప్రార్థన చేసి ఆదరించి పంపుతాను. నీ తల్లిదండ్రులు నిన్ను విడచినా యెహోవా నిన్ను చేరదీస్తాడని దేవుని వాగ్దానముంది. నీవు ఆయన అరచేతులలో చెక్కబడియున్నావు. నీ ప్రాకారములు నిత్యము ఆయన యెదుట ఉన్నవి కాబట్టి నీవు దేనికీ చింతించకుండ దిగులుపడకుండ ధైర్యముగా ఉండాలి. పరిశుద్ధ గ్రంథములో దేవుడు తన భక్తులందరినీ ధైర్యపరచాడు. తన వాక్కులచే ఆదరించాడు. వాగ్దానములచేత బలపరచినట్లు వాక్యములో చూడగలము. **“అబ్రామా, భయపడకుము, నేను నీకు కేడెము, నీ బహుమానము అత్యధికమగునని చెప్పెను.”** – ఆదికాం. 15:1. యాకోబుతో – **“నేను నీ తండ్రియైన అబ్రాహాము దేవుడను ఇస్సాకు దేవుడైన యెహోవాను; నీవు పండుకొనియున్న యీ భూమిని నీకును నీ సంతానమునకు ఇచ్చెదను.”** – ఆదికాం. 28:13 నీ తండ్రికి ఏవిధముగా తోడుగా ఉన్నానో అదేవిధముగా నీకు తోడుగా ఉండి నిన్ను ఆశీర్వదిస్తానని వాగ్దానము చేశాడు. దేవుడు లక్షలాది ఇశ్రాయేలీయులను ఐగుప్తుదాస్యమునుండి వాగ్దాన దేశమైన కనానుకు నడిపించడానికి మోషేను ఏర్పరచుకుంటాడు. అప్పుడు మోషే నేను నోటి మాంద్యము గలవాడను మాట నేర్పరిని కాదు అన్నప్పుడు దేవుడు మోషేతో – **“నీవు భయపడకు నేను నీ నోటికితోడైయుంటాను”** అని అంటాడు. కన్య మరియ లోకరక్షకుడికి జన్మ నివ్వడానికి భయపడుతున్నప్పుడు దూత ప్రత్యక్షమై **“మరియా, నీవు భయపడకు, నీవు దేవునివలన కృప పొందితివి”** అని శుభవచనము పలికాడు. షద్రకు, మేషాకు, అబేద్నెగోయనువారు ప్రతిమకు నమస్కరించనందున అగ్ని గుండములో వేయబడ్డారు. దేవుడు నాలుగవవాడిగా ఆ అగ్ని గుండములో వారితో పాటు ఉండి అగ్నివాసన కూడ అంటకుండా వారిని కాపాడాడు. దేవుడు నిన్ను విడువడు ఎడబాయడు. వాక్యము ధ్యానిస్తున్న ప్రతి ఒక్కరితో దేవుడు మాట్లాడుతున్నాడు. దేనిగూర్చి చింతిస్తూ భయపడు తున్నావు? విశ్వాసులు దేనికీ భయపడకూడదు. శ్రమలైనా, రోగమైనా, ఆర్థిక ఇబ్బందులైనా, అనారోగ్యమైనా, శత్రుబాధయైనా, పిల్లల భవిష్యత్తును గూర్చియైనా భయపడకూడదు. దేవునికి భయపడువారు దేనికీ భయపడకూడదు. దేవుడు శ్రమలో నీకు తోడైయుండి ఆ శ్రమనుండి నిన్ను విడిపిస్తాడు. ఆపత్కాలమున ఆయన నమ్ముకొనదగిన సహాయకుడు. ఆయన యుగసమాప్తివరకు సదాకాలము మనతో ఉంటాడు. మనము ఒంటరివారము కాదు. దేవుడు మనకు తోడుగా ఉన్నాడు. ఎవరు

మనలను చేయి విడచినా దేవుడు మనలను విడువడు ఎడబాయడు. కొందరు నా దగ్గరకు వచ్చి అమ్మా, మేము ఒంటరివారము అందరూ మమ్మును విడిచిపెట్టారని బాధపడతారు. అట్టివారితో దేవుడు మీకు తోడుగా ఉన్నాడు, దేవుడు మిమ్మును ఎన్నడును విడువడు ఎడబాయడు అని చెపుతాను. తండ్రియైన దేవుని ప్రేమ, యేసుక్రీస్తు కృప, పరిశుద్ధాత్మ దేవుని అన్యోన్య సహవాసము మనకుంది (1+3=4). నీకొరకు నాకొరకు ప్రాణమే పెట్టిన ప్రభువు ఉండగా దేనికీ భయపడకూడదు. పరిశుద్ధాత్మ దేవుడు ఆదరణకర్తగా ఎల్లప్పుడు నిన్ను ఆదరిస్తాడు. ఈ నూతన సంవత్సరములో ఒక తీర్మానం చేసికోవాలి. ఎప్పుడూ బిక్కు బిక్కుమంటూ భయపడుతు బ్రదకడమేమిటి? గొప్పదేవుడు సర్వశక్తుడు నీకు ఎల్లప్పుడు తోడుగా ఉన్నాడు వాగ్దానములతో నిండిన పరిశుద్ధ గ్రంథముంది గొప్ప సంఘమును నీకిచ్చాడు. ప్రతిదినము సేవకులద్వారా, కాపరులద్వారా దేవుని వాక్యము వింటున్నావు. దేవుడు నీతో మాట్లాడుతున్నాడు. ఇంక ఎందుకు భయపడాలి? ఎందుకు అధైర్యపడాలి? ఎందుకు దిగులు, కలవరము? గొప్ప దేవునియందు విశ్వాసముంచి ముందుకు సాగిపోవాలి. ప్రభువు నాకు సహాయుడు నరమాత్రులు నాకేమి చేయగలరనే విశ్వాసము నిరీక్షణతో సాగిపోవాలి.

భారమైన పరిచర్యలో యెహోషువ 40 సం॥లు మోషేకు సహకరించాడు. లక్షలాది జనమును అరణ్యములో నడిపించడమంటే మాటలా? మోషే దేవునిమీద ఎంతగా ఆధారపడి యుండవచ్చు. మోషే మృతి నొందిన తరువాత మోషే స్థానములో దేవుడు యెహోషువను నాయకుడిగా ఎన్నుకున్నాడు. అప్పుడు యెహోషువ భయపడుతుంటే దేవుడు యెహోషువతో - భయపడకు, నేను మోషేకు తోడైయుండినట్లు నీకును తోడైయుంటానని వాగ్దానమిచ్చి ధైర్య పరుస్తున్నాడు.

**"నిబ్బరము గలిగి ధైర్యముగా నుండుము."** - యెహోషువ 1:6

నిబ్బరము గలిగి ధైర్యముగా ఉండమని దేవుడు మాట్లాడుతున్నాడు. దేవుని వాక్యానుసారముగా జీవించేవారు దేనికీ భయపడరు. నీవు దేనికి బహుగా భయపడతావో అది రెక్కలు ఈకలతో రూపముదాల్చి నీయొద్దకు వస్తుంది. కాబట్టి విశ్వాసులు దేనికీ భయపడకూడదు. నీ విశ్వాసముద్వారా దేవుని ఘనపరచాలి. "విశ్వాసము లేకుండా దేవుని కిష్టులైయుండుట అసాధ్యము" (హెబ్రీ 11:6). ఈ క్రొత్త సం॥లో దేవుని కిష్టులుగా జీవించాలంటే దేవునియందు గొప్ప విశ్వాసము కలిగి యుండాలి. సర్వోన్నతమైన స్థలములలో దేవునికి మహిమ, ఆయన కిష్టులైన వారికి భూమిమీద సమాధానము అనుగ్రహిస్తాడు. మనము దేవుని పిల్లలము పిల్లలమైతే వారసులము. దేవుని వాగ్దానములకు వారసులము. నీ విశ్వాసమే నిన్ను అభివృద్ధిలోనికి తీసికొనివస్తుంది. కాబట్టి ఎలాంటి నెగిటివ్ ఆలోచనలు తలంపులు నీ మదిలోనికి రాకుండ వాటిని బంధించాలి.

1992 లో నేను సేవ ఆరంభించినప్పుడు ఎన్నో ఆటంకములు ఎదుర్కొన్నాను. దేవుడు దర్శనమిచ్చి సేవ చేయమని పిలుపునిచ్చాడు. ఒక స్త్రీగా నిలబడి సేవ చేస్తున్నప్పుడు ఎన్నో విమర్శలు, ఆటంకములు పోరాటములు ఎదుర్కొన్నాను. అప్పుడు **"నీవు బ్రదుకు దినములన్నిటను ఏ మనుష్యుడు నీ యెదుట నిలువలేడు"** అనే వాగ్దానము ఎత్తిపట్టి ప్రార్థించి జయము పొందాను. ఈ క్షణమువరకు ఈ వాగ్దానమును దేవుడు నాయెడల నెరవేరుస్తూనే ఉన్నాడు. దేవునికి స్తోత్రము!

లక్షలాది జనమును అరణ్యమార్గములో నడిపించడానికి యెహోషువ భయపడటము సాధారణమైన విషయమే. ఒక చిన్న కుటుంబము పోషించడానికి నడిపించడానికి మీరెంత సతమతమవుతారు. ఒక్కసారి ఆలోచించండి. దేవునిచే ఏర్పరచబడిన దైవజనులు దేవుని ప్రజలను నడిపించడానికి ఎంతగా ప్రయాసపడతారో! దేవుని తోడు, సహాయము, నడిపింపు వారికుంటుంది. కాబట్టి వారు దేవుని చిత్తమును జరిగిస్తారు. దేవుడు వాగ్దానములనిచ్చి వారిని బలపరుస్తాడు. యెహోషువ భయపడుతుంటే దేవుడు - భయపడకు, నేను నీకు తోడైయుంటాను, నిబ్బరము గలిగి ధైర్యముగా ఉండమని అంటున్నాడు. వాక్యము ధ్యానిస్తున్న ప్రతిఒక్కరితో దేవుడు మాట్లాడుతున్నాడు. నిబ్బరముగలిగి ధైర్యముగా ఉండమంటున్నాడు. మోషేకు తోడై యుండినట్లు మనకు కూడ దేవుడు తోడైయుంటాడు. నిన్ను విడువడు ఎడబాయడు. నీవు బ్రదుకు దినములన్నిటిలో ఏ మనుష్యుడు నీ ఎదుట నిలువనేరడు అని వాగ్దానము చేస్తున్నాడు. మన అనుదిన జీవితములో ఈ వాగ్దానములు స్వతంత్రించుకోవాలి. దేవునివాక్యము దివారాత్రులు ధ్యానిస్తూ, దేవుని చిత్తప్రకారము అడుగులు వేస్తే ధైర్యముగా ఉంటావు.

**" -నీవు నిబ్బరముగలిగి జాగ్రత్తపడి బహుధైర్యముగానుండి, నా సేవకుడైన మోషే నీకు ఆజ్ఞాపించిన ధర్మశాస్త్రమంతటి చొప్పున చేయవలెను. నీవు నడుచు ప్రతిమార్గమున చక్కగా ప్రవర్తించునట్లు నీవు దానినుండి కుడికిగాని యెడమకుగాని తొలగకూడదు."** - యెహోషువ1:7

మోషేకు ఆజ్ఞాపించిన ధర్మశాస్త్రమంతటి చొప్పున చేయుచు దానినుండి కుడికిగాని ఎడమకుగాని తొలగిపోకూడదని దేవుడు సెలవిస్తున్నాడు. దేవుడు నిన్ను ఈ రక్షణ మార్గములోకి పిలిచి నీతిమార్గములో పరిశుద్ధమార్గములో నడిపిస్తున్నాడు. నీవు దీనినుండి వైదొలగకూడదు. ఒకరు నన్నడుగుతున్నారు - అమ్మా, లంచము తీసికుంటే ఏమవుతుందని? నేనన్నాను - నీ నోరు మంటితో నింపబడుతుందని, దేవుని వాక్యమంటే దేవుడే, పరలోకమునుండి దిగివచ్చిన మన్నా జీవాహారము. వాక్యమును ఎంతగా భుజిస్తే అంతశక్తిని పొందుతాము. దేవుని ధర్మశాస్త్రము నీ హృదయములో ఉంటే నీ అడుగులు జారవు. నీ ప్రవర్తన చక్కగా ఉంటుంది. కుడికిగాని ఎడమకుగాని తొలగిపోవు. దేవుని సేవకులు దేవుని వాక్యమందిస్తుంటే శ్రద్ధగా వినాలి. హృదయములో భద్రము చేసికొని దాని ప్రకారము నడచుకోవాలి. దేవుని వాక్యము వినుటకు వేగిరపడాలి. శక్తిగల దేవుని వాక్యమును మిక్కిలి సాత్వికముతో అంగీకరించాలి. నీ ప్రవర్తన చక్కబెట్టుకోవాలి. అప్పుడు దేవుడు నిన్ను విడువడు ఎడబాయడు. దివారాత్రము దేవునివాక్యము ధ్యానించువారు ధన్యులు. వారు చేయునదంతయు సఫల మవుతుంది. దేవుని వాక్యము ధ్యానిస్తూ, దేవుని వాక్య ప్రకారము నడుచుకుంటూ దేవుని మాటకు విధేయులై జీవిస్తూ ప్రార్థనచేస్తూ దేవునితో సన్నిహిత సంబంధము కలిగియున్నప్పుడు ఆయన నిన్ను విడవడు ఎడబాయడు, లోకములో శ్రమ ఇరుకులు ఇబ్బందులు కలిగినప్పుడు గొప్ప దేవునికి మొఱ్ఱ పెడుతున్నాము విడుదల పొందుతున్నాము. ఈ లోకములో మనము ఒంటరివారము కాదు. నేను మిమ్మును అనాథలుగా విడువనని దేవుడు అంటున్నాడు. మనము దేవుని పేరు పెట్టబడిన దేవుని ప్రజలము. దేవుని వాగ్దానములకు వారసులము. అందుకే **"నిబ్బరముగలిగి ధైర్యముగా నుండుము, దిగులుపడకుము జడియకుము. నీవు నడుచు మార్గమంతటిలో నీ దేవుడైన యెహోవా నీకు తోడైయుండును."** - యెహోషువ1:9

ఈ వాక్యముద్వారా దేవుడు నాతో మాట్లాడి నన్ను ధైర్యపరచాడు. వాక్యము ధ్యానిస్తున్న మీ అందరినికూడ ధైర్యపరచి బలపరుస్తాడు. దేవుడు మనతో మాట్లాడుతున్నాడు. ఆయన నిన్ను విడువడు ఎడబాయడు. నిబ్బరము కలిగి ధైర్యముగా ఉండమని అంటున్నాడు. నీవు నడచు మార్గమంతటిలో నీ దేవుడైన యెహోవా నీకు తోడైయుంటాడు. సదాకాలము నీకు తోడుగా ఉండి మరణమువరకు నిన్ను నడిపిస్తాడు. కాబట్టి మన చింతలు భయములన్నియు పారవేసి నూతనమైన తీర్మానముతో నూతన సం॥లో అడుగుపెడదాము. ఎవరో ఏదో చేస్తారని, ఎవరు మమ్మును పోషిస్తారని చింతించకుండ భయపడకుండ దిగులుపడకుండ నిబ్బరము గలిగి ధైర్యముగా దేవునియందు అచంచలమైన విశ్వాసముతో సాగిపోదాము. నీతిమంతులు విశ్వాసమూలముగా బ్రదుకుతారు. ప్రభువు మనలను విడువడు ఎడబాయడు అనే ధైర్యముతో క్రొత్త సం॥లో అడుగుపెడదాము. మనుష్యులందరు విడిచిపెట్టినా, నీ స్వంతవారు నిన్ను విడిచిపెట్టినా దేవుడు నిన్ను ఎన్నడును విడువడు; ఏ మాత్రము ఎడబాయడు. దివారాత్రులు దేవుని వాక్యము ధ్యానిస్తూ దేవుని ఆజ్ఞలు అనుసరిస్తూ నడుచుకోవాలి. దేవుడనుగ్రహించిన రక్షణను భయముతోను వణకుతోను కొనసాగించాలి. పాపము చేయకుండా, దేవుని ఆజ్ఞలు మీరకుండా పరిశుద్ధముగా జీవించడానికి తీర్మానించుకోవాలి. దేవునికి సన్నిహితముగా జీవించాలి. అప్పుడు దేవుడు నిన్ను విడువడు, ఎడబాయడు. నీవు నడుచు మార్గమంతటిలో దేవునితోడు, సహాయము, నడిపింపు పొందుతావు. నీవు నీటికాలువల యోరను నాటబడి ఆకువాడక తన కాలమందు ఫలమిచ్చు చెట్టువలె ఉంటావు. నీవు చేయునదంతయు సఫలమగును. దేవునికి స్తోత్రం హల్లెలూయ!

# దేవుని సహస్రనామములు

## 237. నరుల ముఖమును లక్ష్యపెట్టనివాడు.

– ద్వితీ.కాం. 10:17

**"ఏలయనగా నీ దేవుడైన యెహోవా పరమదేవుడును పరమప్రభువునై యున్నాడు. ఆయనే మహాదేవుడు పరాక్రమవంతుడు భయంకరుడైన దేవుడు. ఆయన నరుల ముఖమును లక్ష్యపెట్టనివాడు, లంచము పుచ్చుకొననివాడు"**

– ద్వితీ.కాం. 10:17

ఆయన నరుల ముఖమును లక్ష్యపెట్టనివాడు. మనమైతే సాధారణముగా నరుల ముఖమునే చూస్తాము. వారు గొప్పవాళ్లా, అందగాళ్లా, ఆస్తి కలిగిన వారా, సిరిసంపదలు ఉన్నవారా, పేరుప్రఖ్యాతులు స్థానమానములు కలిగియున్నారా అని లక్ష్యముంచుతాము. కాని ఆయన నరులు లక్ష్యపెట్టేది లక్ష్యపెట్టడు. ఆయన నరుల ముఖమును లక్ష్యపెట్టనివాడు. అంటే దేవుడు మన పైరూపములు చూడడు కాని మన హృదయములను పరీక్షిస్తాడు. అంతరంగమును లక్ష్యపెడతాడు.

ఉదయకాలము ఒక బ్యూటీషియన్ నా దగ్గరకు ప్రార్థనకొరకు వచ్చింది. ఆమె వృత్తిలో దేవుడు ఆమెను దీవించాలని ప్రార్థన చేయమని అడిగింది. నాతో అంది – అమ్మా, అందముగా కనపడటానికి మీకేదైనా సహాయం కావాలంటే నేను చేస్తాను అంది. ఆ బిడ్డతో – వాక్యము ధ్యానించడానికే సమయము సరిపోదు, ఇంక అందము గురించి శ్రద్ధ తీసుకునే సమయము నాకెక్కడిదని చెప్పి ఆ బిడ్డకొరకు ప్రార్థన చేసి పంపాను. ముఖములో ఉన్న ముడతలు మొటిమలు మచ్చలు కనపడకుండా చక్కగా అందముగా కనపడటానికి మనుష్యులు ఎంతగానో ప్రయత్నిస్తునే ఉంటారు. దేహము దేవుని ఆలయము. పరిశుద్ధాత్మకు నిలయము. మందిరము ఏ విధముగా పరిశుభ్రముగా పవిత్రముగా పెడతామో, నీ దేహమనే ఆలయమును చక్కగా పెట్టుకోవడములో తప్పేమీ లేదు. కాని దానికే సమయమంతా వృధా చేస్తూ పాపానికి బానిసలు కాకూడదు.

మనుష్యులైతే పై రూపమును లక్ష్యపెడతారు. కాని దేవుడంటున్నాడు. నేను నరుల ముఖమును లక్ష్యపెట్టనని. రెండు నెలల క్రితము ఓ సంఘ పెద్ద తన కుమార్తె వివాహము చేస్తున్నాడు. ఆ బిడ్డ వివాహముకొరకు సంఘమంతా ఎంతో భారముగా ప్రార్థించారు. ఆ సహోదరుడు ఆహ్వాన పత్రికలు ఇచ్చినప్పుడు ప్రార్థన చేసినవారిని, పేదవారిని ఎవ్వరిని పిలువలేదు. నా దగ్గరకు వచ్చినప్పుడు ఆ సహోదరుని అడిగాను, మీకొరకు చాలామంది ప్రార్థన చేశారు కదా. మీరు కేవలము ఐదుగురికే ఆహ్వానము ఇచ్చారు. గొప్పవారికే ఆహ్వాన పత్రికలు ఇచ్చారు. మీకొరకు కన్నీళ్లతో ప్రార్థన చేసినవారిని మరచిపోయారు అన్నాను. అతడు ఏమి చేయాలి సిస్టర్, వివాహము చాలా గొప్పగా ఘనంగా చేస్తున్నాము. వివాహమునకు చాలా పెద్దవారు వస్తున్నారు. ఉన్నతమైన హోదాలో ఉండేవారు, గొప్పవారు వస్తారు. వారి మధ్యలో ఈ పేదవారిని పిలిస్తే చూడటానికి బాగుండదని చెప్పాడు. ఈ మాట వినగానే నాకు చాలా బాధ అయింది. ఈ సహోదరునికి దైవభయము లేదా? పేదవారి ప్రార్థన సహాయమయితే కావాలి కాని వారిని వివాహమునకు ఆహ్వానించే మంచి మనస్సు లేదు. వెంటనే నాకు మనస్సులో అనిపించింది. ఈ వివాహము ఎక్కువ కాలము నిలబడదని. పెళ్లయి ఏడాది కూడా కాలేదు వారి వివాహబంధము విడిపోయింది. ఎందుకంటే వారు దేవుని చిత్తమును నెరవేర్చలేదు. నరుల ముఖమును లక్ష్యపెట్టారు. ప్రార్థించిన పేదవారిని చిన్నచూపు చూశారు. దేవుడు ఏనాడూ పేదవారిని తృణీకరించినట్లు వాక్యములో లేదు. మూగవారు, చెవిటివారు, గ్రుడ్డివారు, అంగవైకల్యము గలవారు, దయ్యము పట్టినవారు, కుష్ఠురోగులు ప్రభువు దగ్గరికి వచ్చినప్పుడు ప్రేమతో వారిని దగ్గరకు తీసుకొని స్వస్థపరచాడు. బీదలకు సువర్తమానము ప్రకటించడానికే దేవుడు నన్ను అభిషేకించాడని చెప్పాడు. ఆయన యొద్దకు వచ్చినవారిని ఆయన కనికరించాడు. ఆయన నరుల ముఖమును లక్ష్యపెట్టడు.

ఈ విధమైన కొన్ని నామములు ధ్యానించినప్పుడు మనలో ఏదైనా అవకతవక లుంటే సరిచేసుకోవాలి. ఆయన స్వభావములు ధ్యానించినప్పుడు దేవుని పోలి నడుచుకోవాలి. ప్రభువా, నీ స్వభావము నాకు దయచేయి అని ప్రార్థించాలి. ఆయన నరుల ముఖమును లక్ష్యపెట్టనివాడు.

**"అయితే యెహోవా సమూయేలుతో ఈలాగు సెలవిచ్చెను - అతని రూపమును అతని యెత్తును లక్ష్యపెట్టకుము, మనుష్యులు లక్ష్యపెట్టు వాటిని యెహోవా లక్ష్యపెట్టడు; నేను అతని త్రోసివేసియున్నాను. మనుష్యులు పైరూపమును లక్ష్యపెట్టుదురు గాని యెహోవా హృదయమును లక్ష్యపెట్టును".**

– 1 సమూ. 16:7

ఒక బిడ్డ నా దగ్గరకు ప్రార్థనకొరకు వస్తుంది. ఆ బిడ్డ ఎప్పుడూ, చాలా సీరియస్‌గా వుంటుంది. ఆ బిడ్డతో అన్నాను. – ఎందుకు ఎప్పుడూ సీరియస్‌గా వుంటావు. నీవు నవ్వితే చూడాలని ఆశిస్తున్నాను అని. ఆ బిడ్డ వెంటనే కన్నీళ్లతో నాకు కూడ నవ్వాలని వుంటుంది కాని ఎందుకు నవ్వనో తెలుసా ఆంటీ, నాకు చాలా ఎత్తుపళ్లు వుంటాయి. నవ్వితే అవి కనపడతాయి. అందరూ వెక్కిరిస్తారని నవ్వకుండ వుంటాను అంది. ఆ బిడ్డను దగ్గరకు తీసికొని ధైర్యము చెప్పాను. బిడ్డా, నిన్ను నీవు అలాగున తక్కువ చేసికోకు. నీవు చాలా అందముగా ఉంటావు. దేవుడు చేసిన ప్రతిది అందముగా వుంటుంది. నీవు దేవుని సృష్టివే కాబట్టి చక్కగా నవ్వు. నీ పళ్లు ఎత్తుగా, వంకర టింకరగా ఉన్నాయని మూతి ముడుచుకొని సీరియస్‌గా వుండటము దేవుని చిత్తము కాదు. నీవు మనసారా నవ్వమని చెప్పాను. నీ హృదయములోని ఆత్మ సౌందర్యమే నీ ముఖమునకు కాంతినిస్తుంది. నీ ముఖమునకు ప్రకాశమానమైన వెలుగునిచ్చే ఆత్మాభిషేకము పొందు అని చెప్పాను. అప్పుడు ఆ బిడ్డకు నెమ్మది వచ్చింది. ఎంతో ఆదరింపబడింది. నరుల ముఖమును ఆయన లక్ష్యపెట్టడు. బాహ్య సౌందర్యము కాపాడుకోవడములో తప్పులేదు. కాని అదే ధ్యాసగా వుండి దేవునికి దూరమైపోకు. ఆయన నీ అంతరంగ సౌందర్యమును కోరుకుంటాడు కనుక నీ హృదయమును పవిత్రముగా పెట్టుకోవాలి. పరిశుద్ధతయే నీకు అలంకారముగా మారిపోవాలి.

**"నీ హృదయములోనుండి జీవధారలు బయలుదేరును కాబట్టి అన్నిటికంటె ముఖ్యముగా నీ హృదయమును భద్రముగా కాపాడుకొనుము."**–సామెతలు 4:23

నీ హృదయమును భద్రముగా కాపాడుకోవాలి. పాపము, పగ, ఈర్ష్య, ద్వేషములాంటి దుర్నీతి నీ హృదయములో ప్రవేశించకూడదు. నీ పై రూపము, శరీరము ఏలాగు అందముగా కనపడాలని కోరుతున్నావో అంతకంటే ఎక్కువగా నీ హృదయము దేవుని సన్నిధిలో అందముగా కనబడాలి. ఎందుకంటే ఆయన పై రూపమును, నరుల ముఖమును లక్ష్యపెట్టడు. శరీరమును అందముగా పెట్టుకోవడానికి ఎన్నో బ్యూటి క్లినిక్‌లు ఉన్నాయి. నీ హృదయమును అందముగా చేసే క్లినిక్ యేసుపాదములే. యేసు రక్తము ప్రతి దుర్నీతినుండి నిన్ను పవిత్రునిగా చేస్తుంది. యేసురక్తమును మించిన లోషన్ ఏదీ లేదు. యేసురక్తము నీ హృదయమును పరిశుద్ధముగా శక్తివంతముగా మారుస్తుంది. అప్పుడు నీ హృదయములోనుండి జీవధారలు బయలుదేరుతాయి. ఆయన నరుల ముఖమును లక్ష్యపెట్టనివాడు. నీవు ప్రార్థన చేసినప్పుడు దేవా, నీవు నరుల ముఖమును లక్ష్యపెట్టవు. హృదయమునే లక్ష్యపెడతావు కనుక నీ రక్త ప్రభావముచే నా రోత హృదయమును మార్చి పవిత్రపరచు తండ్రీ. నా అవకతవకలు సరిచేసి నీ సన్నిధిలో నిందారహితముగా నిలబెట్టమని ప్రార్థించు.

## 238. లంచము పుచ్చుకొననివాడు.

- ద్వితీ.కాం. 10:17

**"ఏలయనగా నీ దేవుడైన యెహోవా పరమదేవుడును పరమప్రభువునై యున్నాడు. ఆయనే మహాదేవుడు పరాక్రమవంతుడు భయంకరుడైన దేవుడు. ఆయన నరుల ముఖమును లక్ష్యపెట్టనివాడు, లంచము పుచ్చుకొననివాడు."** - ద్వితీ.కాం. 10:17

ఆయన నామము 'లంచము పుచ్చుకొననివాడు'. ఈ నామము చదివిన తరువాత లంచగొండులు ఎవరయినా ఉంటే మారిపోవాలి. నీ దేవుడు లంచగొండి కాదు. ఆయన లంచము పుచ్చుకొనడు. నీవు దేవుని చిత్తము మార్చడానికి, ఆయన సంకల్పములు మార్చడానికి ఏదో ముష్టి, ముడుపు తెచ్చి ఆయన చేతిలో పెడితే ఆయన మారిపోతాడని ఏనాడు అనుకోకు. చేసే తప్పులన్నీ చేస్తూ అక్రమమైన జీవితము జీవిస్తూ ఆ అక్రమమైన సంపాదననుండి కొంత దేవునికి కానుకగా ఇస్తే సరిపోతుందని ఆయన కన్నులు కప్పడానికి కొందరు ప్రయత్నిస్తుంటారు. జాగ్రత్త! అట్టివారు ఏనాడు దేవుని శిక్షను తప్పించుకొనరు. ఆయన లంచగొండి దేవుడు కాదు. ఆయన లంచము పుచ్చుకొననివాడు.

సాధారణముగా మనము వింటుంటాము. ఏదైనా కార్యము జరగాలంటే చేతులు తడపాలని. ఎక్కడ చేతులు తడపాలో నేర్చుకుంటే పనులన్నీ సునాయాసముగా జరిగిపోతాయని అంటుంటారు. లంచము ఇవ్వడము, లంచము పుచ్చుకొనడము రెండూ నేరములే. నేను ఈ మధ్యనే ఒక వార్త విన్నాను. ఒక ఉద్యోగి తాను పనిచేస్తున్న కంపెనీనుండి డబ్బు దోచుకొని దేవుని పరిశుద్ధాలయమునకు ఇచ్చాడని. ఆయన అనుకున్నాడు - నేను దేవునికి చాలా ప్రీతికరమైన పని చేశానని దేవునికి ఇష్టానుసారముగా ప్రవర్తించానని. కాని దానివలన అతనికి ప్రతిఫలము ఏమీ రాలేదు పైగా అతని ఉద్యోగం పోయింది. కొంతమంది అన్నారు, ఆ... ఏమవుతుంది? అతడు దోచుకున్నది దేవుని గుడికే కదా ఇచ్చాడని. అది విని చాలా ఆశ్చర్యపోయాను. దేవుని గుడికి, దేవుని కార్యములు జరుగడానికి దొంగసొమ్ము, దోపుడు సొమ్ము కావాలా? పరిశుద్ధ గ్రంథములో దేవుడు ఎక్కడైనా ఈ విధముగా చెప్పాడా? ఆయన శ్రీమంతుడు. పరిశుద్ధమైన దేవుడు. ఆయన ఆలయము పరిశుద్ధాలయము. పరిశుద్ధుడైన ప్రభువుకు అక్రమమైన డబ్బు అవసరము లేదు. మీరు నాతో ఏకీభవిస్తే దేవుని స్తుతించండి.

నీ సొంత చిత్తప్రకారము చేయకూడదు. నీ జీవితములో నీవు వేసే ప్రతి అడుగు దేవుని సన్నిధిలో పరీక్షించుకోవాలి. ప్రభువా, ఇది నీకిష్టమైనదా? నీ చిత్తానుసారముగా వుందా? నీ వాక్యమునకు అనుగుణముగా నడుచు కుంటున్నానా? నేను చేసేది నీతికార్యమేనా? అని నిన్ను నీవు పరీక్షించుకోవాలి. ఒకవేళ నీవు మంచి ఉద్దేశముకొరకు చెడుకార్యములు చేసినా అది దేవుడు ఇష్టపడడు. నీవు నీ చిత్తానుసారముగా ఏవేవో జరిగించి ఏం ఫరవాలేదులే అనుకుంటే సరిపోదు. ఆయన కన్నులు కప్పలేవు. నీతి న్యాయములు ఆయన సింహాసనమునకు ఆధారములు. ఆయన అక్రమము చేయువాడు కాడు. ఆయన లంచము పుచ్చుకొనడు. నా దగ్గర పనిచేసే బిడ్డలను, నాకు పనులలో సహకరించేవారిని మాటి మాటికి సరిచేస్తుంటాను. గుడి పనులు చేస్తున్నానని వంకర టింకర జీవితముంటే నీకు దేవుని దగ్గరనుండి రెండంతలుగా శిక్ష వస్తుంది. గుడిలో చాలా పనిచేస్తున్నాను. ఏ పాపము చేసినా నడిచిపోతుందని అనుకుంటున్నావా? అంటూ గద్దిస్తాను. వారిని సరిచేయడానికి నేను భయపడను. ఎందుకంటే అట్టి అధికారము దేవుని సేవకురాలిగా దేవుడు నాకిచ్చాడు. నేనెలాగు పరిశుద్ధముగా యథార్థముగా దేవుని సేవిస్తున్నానో నాకు సహకరించే బిడ్డలు, నా సంఘము కూడ పవిత్రముగా నీతిగలిగిన పరిశుద్ధ జనముగా ఉండాలనేదే నా ఆశ. నేను సేవ చేస్తున్నానని చెప్పి నా ఇష్టానుసారముగా బ్రదికితే దేవుడు ఊరుకుంటాడా? ఎవరయితే దేవుని సేవ చేస్తున్నారో దేవుని పరిచర్యలో పాలుపొందుతున్నారో వారికి కఠినమైన తీర్పు వుందని వాక్యము సెలవిస్తుంది. మనము ఆరాధించే దేవుడు లంచము పుచ్చుకొననివాడు. కనుక ఎటువంటి లంచము సొమ్ము నీ యింటికి తేకూడదు. ఏ అన్యాయపు సిరిని నీ యింటిలోకి తేకు. నీవు కష్టపడి చెమటోడ్చి సంపాదించు. నీ కష్టార్జితమును ఆయన ఆశీర్వదిస్తాడు. నీవు దేవునికి కానుకగా సమర్పించేదికూడ నీ కష్టార్జితమై వుండాలి. అప్పుడు దేవుని దీవెనలు నీ మీదకు వస్తాయి.

ఒక వ్యక్తి నన్ను అడిగాడు. అమ్మా, ఆఫీసులో లంచము తీసికున్నాను. దానిలో దశమ భాగము గుడికి ఇస్తానని అన్నాడు. వెంటనే నేను గద్దించాను. నీ పాపములో నాకెందుకు పాలు పంచుతున్నావు. లంచము తీసికోవడము పాపము. అట్టి అన్యాయపు సొమ్ము కానుకల పెట్టెలో వేయకూడదని ఖచ్చితముగా చెప్పాను. లంచము పుచ్చుకోవడము పాపమని ధర్మశాస్త్రములో ఉంది. లంచము నీకు గుడ్డితనము కలిగిస్తుంది. నిన్ను నాశనములోకి ఈడుస్తుంది. నీ నోరు మంటితో నింపబడుతుంది. లంచము పుచ్చుకోవడముద్వారా ప్రజలకు ద్రోహము చేస్తున్నావు. దేశానికి ద్రోహము చేస్తున్నావు. ప్రజల ఉసురు నీ ఇంటిమీదకు వస్తుంది. ఉద్యోగము ఇప్పిస్తానని మోసపు మాటలు చెప్పి 50,000 రూపాయలు తీసికుంటావు. అది ఎవరిదో కష్టార్జితము. ఎంత కష్టపడి ఆ డబ్బు తెచ్చాడో నీకు తెలియదు. నీవు హాయిగా ఖర్చుపెట్టేస్తావు. ఇచ్చిన వ్యక్తి చెమట, ఉసురు నిన్ను వెంటాడదా? ఎందుకు పాపము చేస్తావు? దేవుడు నీకు అన్ని అవయవములు సరిగా ఇచ్చాడు. బలమైన చేతులిచ్చాడు. కష్టపడి పనిచెయ్యి. దేవుని నమ్ముకో. ఆయనను ఆశ్రయించు. నీ చేతుల కష్టార్జితములో ఆకుకూరల భోజనము తిన్నా ఫరవాలేదు కాని లంచము పుచ్చుకొనకు. మన దేవుడు లంచము పుచ్చుకొననివాడు.

**"నీతిమంతుని కష్టార్జితము జీవదాయకము."** - సామెత 10:16

**"అన్యాయముచేత కలిగిన గొప్ప వచ్చుబడికంటె నీతితోకూడిన కొంచెమే శ్రేష్ఠము."** - సామెత 16:8

**"మోసము చేసి తెచ్చుకొన్న ఆహారము మనుష్యులకు బహు ఇంపుగా ఉండును పిమ్మట వాని నోరు మంటితో నింపబడును."** - సామెత 20:17

**"లంచము నసహ్యించుకొనువాడు బ్రదుకును."** - సామెత 15:27

నేనెప్పుడూ దేవుడు నాకిచ్చిన సంఘముకొరకు ప్రార్థిస్తాను. నా సంఘములోని బిడ్డలందరిని పరిశుద్ధ సైన్యముగా చేయమని ప్రార్థిస్తాను. వారు ఏదైనా తప్పు చేస్తే వారి మనస్సాక్షి వెంటనే గద్దించాలి. ఈ పని చేయకూడదని వారి అంతరాత్మ వారికి బోధించాలి. ప్రార్థించినప్పుడు దేవుడు నాకిచ్చిన వాగ్దానము.

**"నీ జనులందరు నీతిమంతులై యుందురు నన్ను నేను మహిమ పరచుకొనునట్లు వారు నేను నాటిన కొమ్మగాను నేను చేసిన పనిగాను ఉండి దేశమును శాశ్వతముగా స్వతంత్రించుకొందురు."**- యెషయా 60:21

తప్పకుండ దేవుడు నా ఆశను నెరవేరుస్తాడు.

**"నిర్దోషికి ప్రాణహాని చేయుటకు లంచము పుచ్చుకొనువాడు శాపగ్రస్తుడని చెప్పగా ప్రజలందరు - ఆమేన్ అనవలెను."** - ద్వితీ.కాం. 27:25

ఒక లంచగొండి యేసుప్రభువును చూడగానే మారిపోయాడు. సుంకపు గుత్తాదారుడు జక్కయ్య యింటికి ప్రభువు రాగానే జక్కయ్య రక్షింపబడ్డాడు.

జక్కయ్య ఎవరి దగ్గరయితే ఏమేమి అన్యాయముగా తీసికొన్నాడో తిరిగి నాలుగంతలు మరల చెల్లింతునని ప్రభువుతో చెప్పెను.

**"జక్కయ్య నిలువబడి - ఇదిగో ప్రభువా, నా ఆస్తిలో సగము బీదల కిచ్చుచున్నాను; నేనెవనియొద్దనైనను అన్యాయముగా దేనినైనను తీసికొనిన యెడల అతనికి నాలుగంతలు మరల చెల్లింతునని ప్రభువుతో చెప్పెను. అందుకు యేసు - ఇతడును అబ్రాహాము కుమారుడే; ఎందుకనగా నేడు ఈ యింటికి రక్షణ వచ్చియున్నది."** - లూకా 19:8,9

జక్కయ్యలాగా మనలో కూడా ఎవరైనా అన్యాయముగా సంపాదించిన సొమ్ముకు తిరిగి నాలుగంతలు ఇచ్చేస్తే ఎంత బాగుంటుంది. 4,000 రూ॥లు తీసికుంటే 16,000 రూ॥లు తిరిగి ఇవ్వాలి. ఇది అసాధ్యమని అనుకుంటున్నారా? ప్రభువులో ఉంటే సమస్తము సాధ్యము. అన్యాయపు సొమ్ము అక్రమమైన సంపాదన లంచము ఆశించకుంటే దేవుడు తన అపారమైన దీవెనలు నీకు అనుగ్రహిస్తాడు. ఆయన లంచము పుచ్చుకొనడు కనుక ఆయన బిడ్డగా నీవుకూడ లంచము తీసికోకూడదు. ఒకవేళ నీకు అట్టి అలవాటుంటే ఈ నామము ధ్యానించిన తరువాత ఆ అలవాటు విడిచిపెట్టు. ప్రభువు సహాయము చేస్తాడు.

## 239. యెహోవా తన మార్గములన్నిటిలో నీతిగలవాడు.

- కీర్తన 145:17

**"యెహోవా తన మార్గములన్నిటిలో నీతిగలవాడు తన క్రియలన్నిటిలో కృపచూపువాడు."** - కీర్తన 145:17

ఒకొక్క నామము ధ్యానించడముద్వారా పరిశుద్ధాత్ముడు ఆయన స్వభావములను మనకు బయల్పరుస్తున్నాడు. దేవుని స్వభావములు నేర్చుకొని వాటిని అనుసరించి మన జీవితములు కట్టుకోవాలి. ఆయన నీతిగలవాడు. ఆయనలో ఏ అవినీతి లేదు. ఆయన నీతిమంతులకు ప్రతిఫలమిచ్చే దేవుడు. నీతి న్యాయములు ఆయన సింహాసనమునకు ఆధారములు. ఆయన నీతిమంతులను ప్రేమిస్తాడు. నీతిమంతులను సంరక్షిస్తాడు. నీతిమంతులను వర్ధిల్లచేస్తాడు. ఆయన నీతి మరణమునుండి మనలను రక్షిస్తుంది. ఆయన నీతి మనకు నిత్యజీవము నిస్తుంది. ఆయన తన మార్గములన్నిటిలో నీతిగలవాడు.

ఈ రోజుల్లో పరిశుద్ధాలయములో కూడ కలహాలు, యుద్ధాలు, పోరాటములు, అబద్ధాలు, చెడ్డమాటలు, బూతు మాటలు తిట్టుకోవడము జరుగుతున్నాయి. ఎందుకంటే నడిపించే నాయకులలో నీతి కరవైపోయింది. చెప్పేది ఒకటి చేసేది ఒకటి.

పౌలు భక్తుడు రోమీయులకు వ్రాస్తున్నాడు.

**"ఎదుటివానికి బోధించు నీవు నీకు నీవే బోధించుకొనవా? దొంగిలవద్దని ప్రకటించు నీవు దొంగిలెదవా? వ్యభిచరింపవద్దని చెప్పు, నీవు వ్యభిచరించెదవా? విగ్రహములను అసహ్యించుకొను నీవు గుళ్లను దోచెదవా? ధర్మశాస్త్రమందు అతిశయించు నీవు ధర్మశాస్త్రము మీరుటవలన దేవుని అవమానపరచెదవా? వ్రాయబడిన ప్రకారము మిమ్మునుబట్టియేగదా దేవుని నామము అన్యజనుల మధ్యను దూషింపబడుచున్నది? నీవు ధర్మశాస్త్రమును అనుసరించి ప్రవర్తించు వాడవైతివా, సున్నతి ప్రయోజనకరమగును గాని ధర్మశాస్త్రమును అతిక్రమించువాడవైతివా, నీ సున్నతి సున్నతి కాకపోవును."** - రోమా 2:21-25

ఆయన నీతిమంతుడు కనుక నిన్ను కూడ నీతిమార్గములలో నడుపమని ప్రభువును వేడుకోవాలి. ఆయన దగ్గర ఏ అనీతిమత్వము చెల్లదు. నీవు దేవునికంటే ఎక్కువగా పాపమును ప్రేమించావంటే నీ ప్రార్థనలన్నీ పాపముగా మారిపోతాయి. ఇతరుల సొమ్మును ఆశించకూడదు. పరుల సొత్తును ఆశించడము కూడ పాపమే. పరిశుద్ధ గ్రంథము పట్టుకొని గుడికి వెళతాము. దీర్ఘ ప్రార్థనలు చేస్తాము, కాని నీలో నీతి న్యాయములు కనబడటము లేదు. ఆయన తన మార్గములన్నిటిలో నీతిగలవాడు. ఆయన పరిశుద్ధుడు పవిత్రుడు నిర్దోషి నిష్కల్మషుడు పాపులలో చేరక ప్రత్యేకముగా ఉన్నవాడు. అలాంటి ప్రభువును నీవు కలిగియున్నావు. ఆయన నీకు నాయకుడుగా ఉన్నాడు. నీకు శిరస్సుగా ఉన్నాడు. ఆయన బిడ్డగా వున్న నీవు ఆయన చూపిన మార్గములో నడవాలి. దేవునియొక్క స్వభావములు నామములద్వారా తెలిసికుంటున్న మనము ఆయనను పోలి నడుచుకోవాలి.

మోషే అహరోనులు దేవుని ప్రజలను నడిపించినప్పుడు - కోరహుదాతాను అబీరాములు అవినీతికి తలవంచి దేవునిచేత అభిషేకింపబడిన మోషే అహరోనులకు ఎదురు తిరిగారు. వారు తమ నీతిని వదలి పెట్టారు. అధికార దాహము వారిలో ప్రవేశించింది. దైవ జనునికి ఎప్పుడూ ఎందుకు లొంగియుండాలని తిరుగబడినారు. దానికి తగిన ఫలము అనుభవించారు. భూమి నెరవిడిచి కోరహు సంబంధికు లందరిని ప్రాణముతోనే మ్రింగివేసింది. తన మార్గములన్నిటిలో నీతిగలవాడు, న్యాయము గల దేవుడు దైవజనునికి న్యాయము తీర్చాడు.

**"అతడు ఆ మాటలన్నియు చెప్పి చాలించగానే వారి క్రింది నేల నెరవిడిచెను. భూమి తన నోరు తెరచి వారిని వారి కుటుంబములను కోరహు సంబంధులందరిని వారి సమస్త సంపాద్యమును మ్రింగివేసెను. వారును వారి సంబంధులందరును ప్రాణముతో పాతాళములో కూలిరి; భూమి వారిని మ్రింగివేసెను, వారు సమాజములో ఉండకుండ నశించిరి."** - సంఖ్యా కాం. 16:31-33

అందుకే విశ్వాసులు లోకాశలు, ఐగుప్తు ఆశలన్నియు విడిచిపెట్టి విశ్వాసమునకు కర్తయు దానిని కొనసాగించువాడైన యేసువైపే చూస్తూ ముందుకు సాగిపోవాలి. ఆయన నీతిమంతుడు, పరిశుద్ధుడు. ఆయనలో ఏ దోషము లేదు. ఆయన తన మార్గములన్నిటిలో నీతిగలవాడు. ఆయనను అనుసరించే ప్రతిబిడ్డ పవిత్రముగా వుండి నీతి మార్గములలో నడవాలని ఈ నామము మనకు జ్ఞాపకము చేస్తుంది.

**"నీతిమంతుల గుడారములలో రక్షణనుగూర్చిన ఉత్సాహసునాదము వినబడును. యెహోవా దక్షిణహస్తము సాహస కార్యములను చేయును."** - కీర్తన 118:15

నీతికి, దేవుని హస్తమునకు చాలా దగ్గర బంధము వుంది. నీవు ఎంత నీతిగలిగి నడుచుకుంటే నీకు దేవుడంత సమీపముగా వుంటాడు. నీతిమంతుల గుడారములలో రక్షణను గూర్చిన ఉత్సాహ సునాదము వినబడుతుంది. అట్టి గృహాలలో యెహోవా దక్షిణ హస్తము సాహసకార్యములు జరిగిస్తుంది. నీవు నీతిగా ప్రవర్తిస్తే యెహోవా హస్తము నీకు తోడుగా వుంటుంది.

భక్తుడు ప్రార్థిస్తున్నాడు.

**"నా నీతికి ఆధారమగు దేవా, నేను మొఱ్ఱపెట్టునప్పుడు నాకుత్తర మిమ్ము. ఇరుకులో నాకు విశాలత కలుగజేసినవాడవు నీవే నన్ను కరుణించి నా ప్రార్థన నంగీకరించుము."** - కీర్తన 4:1

'యెహోవా తన మార్గములన్నిటిలో నీతిగలవాడు' అను నామముతో దేవుని స్తుతించి నన్ను నీ నీతిమార్గములలో నడిపించమని ప్రార్థించాలి.

❁ - సశేషం

# దేవుని వెయ్యి వాగ్దానములు

గత సంచిక తరువాయి...

## 84. భయపడకుము నేను నీ దేవుడనైయున్నాను.

- యెషయా 41:10

**"భూదిగంతములనుండి నేను పట్టుకొని దాని కొనలనుండి పిలుచుకొనినవాడా, నీవు నా దాసుడవనియు నేను నిన్ను ఉపేక్షింపక యేర్పరచుకొంటిననియు నేను నీతో చెప్పియున్నాను నీకు తోడైయున్నాను. భయపడకుము నేను నీ దేవుడనై యున్నాను దిగులుపడకుము నేను నిన్ను బలపరతును నీకు సహాయము చేయువాడను నేనే నీతియను నా దక్షిణహస్తముతో నిన్ను ఆదుకొందును."** - యెషయా 41:9-10

దేవుడు, భయపడకు నా కుమారుడా! భయపడకు నా కుమారీ! నేను నీ దేవుడనై యున్నాను నీకు సహాయం చేస్తాను నిన్ను ఆదుకుంటాను అని అంటున్నాడు. ఈ లోకంలో భార్యాభర్తల్లో భార్యకు ఏదైనా సమస్య వస్తే ఆమె భర్త నేను నీ భర్తను కానా? నేను నిన్ను కాపాడనా? అని అంటాడు. కొందరు స్త్రీలు వారి భర్తలతో ఎందుకు అంతగా భయపడుతున్నావు? నీకు నేను లేనా అని అంటారు. కొందరు తల్లిదండ్రులు వారి పిల్లలతో ఎందుకు బిడ్డా భయపడుతున్నావు. మేము నీకు లేమా? మేము చూసుకుంటాము అని అంటారు. ఎంతమట్టుకు వారు ఈ లోకంలో ఉంటారో దేవుడు ఎరుగును. ఇలా అన్నవారందరు లోకమునుండి దాటిపోతారుగాని మార్పులేనివాడు, మారనివాడు, నాశనము లేనివాడు, యుగయుగములు ఉండువాడు. సజీవుడైన దేవుడు అంతకన్నా గొప్ప మాటలు చెబుతున్నాడు. భయపడకు నేను నీ దేవుడనని అంటున్నాడు. ఆయనకు అసాధ్యమైనది ఏదీ లేదు.

నేను 2003వ సంవత్సరంలో ఒక గృహాన్ని దర్శించాను. అనురాధ, ఆంద్రూజేమ్స్ అనే దంపతులు కుటుంబముగా యు.పి.ఎఫ్. సంఘానికి వచ్చేవారు. 23-10-2003న ఉదయం హఠాత్తుగా హార్ట్ ఎటాక్‌తో ఆంద్రూజేమ్స్ చనిపోయాడు. ఉదయం హార్ట్ ఎటాక్ వచ్చింది. గంటలో అతను చనిపోయాడు. ఆ సందర్భంలో నేను వారి గృహాన్ని దర్శించాను. ఆ కుటుంబానికి వెళ్లినప్పుడు అక్కడ చాలా మంది జనం కూడియున్నారు. అతని భార్య అనురాధ దుఃఖం చూడలేకపోతున్నాను. ఎంతో తల్లడిల్లి పోతుంది. నన్ను చూసి సిస్టర్! ఇప్పుడు నా భర్తను బ్రతికించు. నీవు ముట్టుకుంటే అతను బ్రతుకుతాడు అంటుంది. ఆమెతో మాట్లాడే పరిస్థితే లేదు. ఆదరణలేక తన్ను తాను కొట్టుకుంటుంది. అందరూ చూస్తున్నారు. ఆమెకు అంతగా కలవరం ఎందుకు కలిగిందంటే ఆమె ఎక్కువగా భర్తపై ఆనుకుంది. ఆ క్రుంగుదలనుండి ఆమెను లేవనెత్తాలంటే ఆమెకు దేవునిపై ఇంకా విశ్వాసం, నమ్మకము చాలా అవసరమని ఆమెను దగ్గరికి తీసికొని తలపై చెయ్యిపెట్టి ప్రార్థించి నీళ్లు త్రాగించాను. అయినా కొట్టుకుంటుంది. నేను మీ ఇంటికి వస్తాను రా! అన్నాను. పై అంతస్థులో ఆమె ఇల్లు. ఎవ్వరు చెప్పినా మాట వినడం లేదు. జాయ్ సిస్టర్ మన ఇంట్లోకి వస్తుంది. రా! లే! అని భర్తను లేపుతుంది. ఆమెకు మతిస్థిమితం లేదు. అప్పుడామెకు నేను ఈ మాటలు చెప్పాను. మనుష్యులు తప్పక మరణిస్తారు. నీ భర్త లోకమునుండి గతించిపోయాడు గాని దేవుడు గతించి పోలేదు. దేవుడు నీకు తోడైయున్నాడు, నీకు సహాయం చేస్తాడు నిన్ను బలపరుస్తాడు నిన్ను ఆదుకుంటాడు నిత్యము నిన్ను నడిపిస్తాడని చెప్పాను. ఇప్పుడు ఆమె పిల్లలను చక్కగా పోషించుకొంటుంది.

లోకంలో అందరూ గతించిపోతారు. నీవు ఈ రోజు లోకంలో ఎవర్నైతే చాలా గొప్పగా అనుకుంటావో, ఎవర్నైతే ఆనుకుంటావో వారు ఏదో ఒక రోజు దుమ్ము, ధూళితో సమానమైపోతారు. కాని చావులేనివాడు, నిరంతరం జీవించువాడు నీ దేవుడై యున్నాడు. మనము ఆయన ప్రజలమైయున్నాము. పౌలు భక్తుడు ఆయన నా దేవుడు అని అంటున్నాడు. నీవు ఆయన నా దేవుడు, నావాడు, నేను ఆయన వాడిని, నేను ఆయన దానిని అని అనగలగాలి. దావీదు భక్తుడు **"నాకైతే దేవుని పొందు ధన్యకరము నీ సర్వకార్యములను నేను తెలియజేయునట్లు నేను ప్రభువైన యెహోవా శరణుజొచ్చియున్నాను."** - కీర్తన 73:28 అని అంటున్నాడు.

**"యెహోవా తమకు దేవుడుగాగల జనులు ధన్యులు. ఆయన తనకు స్వాస్థ్యముగా ఏర్పరచుకొను జనులు ధన్యులు."** - కీర్తన 33:12

కావున ఈ రోజే నీ భయమంతా వదిలివేయి. ఏదో రోగం, కీడు వస్తుంది శత్రువులు పై బడతారు. నా భర్త పిల్లలు నన్ను వదిలివేస్తారు. వృద్ధాప్యంలో నా పరిస్థితి ఎలా? నాకు ఇప్పుడు అవమానం కలుగుతుంది అనే వ్యర్థమైన భయములన్నీ ఈ రోజుతో సమాప్తం కావాలని దైవసేవకురాలిగా ఆజ్ఞాపిస్తున్నాను. భయపడకు, దిగులుపడకు దేవుడు నీకు సహాయం చేస్తాడు. నీతి అనే తన దక్షిణ హస్తంతో నిన్ను ఆదుకుంటాడు.

## 85. నీ రాకపోకలయందు యెహోవా నిన్ను కాపాడును.

- కీర్తన 121 :8

ఇక్కడ కీర్తనకారుడు ప్రార్థిస్తున్నాడు. ప్రార్థించేవారికి, దేవునిలో నిలిచి ఉండే వారికి దేవుడు ఎన్నో వాగ్దానములు అనుగ్రహిస్తాడు.

**"కొండలతట్టు నా కన్ను లెత్తుచున్నాను నాకు సహాయము ఎక్కడనుండి వచ్చును? యెహోవావలననే నాకు సహాయము కలుగును ఆయన భూమ్యాకాశములను సృజించినవాడు."** - కీర్తన121:1,2. ఇలా ప్రార్థించి దైవాశీర్వాదములు పొందాడు.

మనము జీవించే ఈ లోకంలో ఎటువంటి భద్రత లేదు. బయటకు వెళ్ళిన వ్యక్తి ఇంటికి సురక్షితంగా వస్తాడనే నమ్మకం లేదు. విశ్వాసి ప్రతిరోజు బైబిల్ చదివిన తర్వాత వార్తాపత్రిక చదవాలి. అప్పుడు దేవుడు నీకు ఎలాంటి భద్రత ఇస్తున్నాడో అర్థం అవుతుంది. లోకంలో జరిగే అక్రమాలకు నీవు గురికాకుండా, దేవుడు ఏవిధంగా నిన్ను మన్నాతో పోషిస్తూ తన రెక్కలతో కప్పుతున్నాడో నీకు అర్థం అవుతుంది. భయంకరమైన ఈ లోకంలో ఎక్కడ ముప్పు దాగి ఉందో తెలియదు. ముఖ్యంగా ట్రాఫిక్‌లో బయటకు వెళ్తే తిరిగి ప్రాణంతో వస్తామో లేదో అనే నమ్మకం లేకుండా పోయింది. కావున తల్లిదండ్రులకు నా హెచ్చరిక ఏమిటంటే పిల్లలు బయటకు వెళ్తున్నప్పుడు వారి తలలమీద చేతులుంచి ప్రార్థనచేసి పంపాలి. యౌవనస్థులు బండికొని ఎంతో స్టైలుగా బయలుదేరి స్కూల్స్, కాలేజీలకు వెళ్తున్నారు. కొందరు కార్లలో ప్రయాణిస్తున్నారు. హైద్రాబాద్‌లో ఉన్నంత అధ్వాన్నమైన ట్రాఫిక్ సిస్టం లోకంలో మరెక్కడా లేదట. ఇక్కడ బ్రతికి బయటపడితే ఎక్కడైనా బ్రతకవచ్చుట. కనుక ప్రార్థించి నీ ప్రయాణం ఆరంభించాలి.

ఒకసారి న్యూస్‌లో చూశాను. సీతాఫలంపండ్లు కొందామని ఓ భార్యాభర్తలు బండి ఆపి ఆ పండ్లు కొంటున్నారు. అంతలో ఓ బస్ దూసుకొని వచ్చి వీరు, అమ్మేవారి మీదినుండి వెళ్ళిపోయింది. అక్కడికక్కడే ఆరుగురు చనిపోయారు. అందులో ఉద్యోగస్థులైన ఈ భార్యాభర్తలు ఉన్నారు. ఉద్యోగం చేసికొని తిరిగివస్తుండగా ఈ ఘటన జరిగింది. వారి పిల్లలు అనాథలైపోయారు. వీరితో పాటు పళ్లు అమ్ముకునే నలుగురు వ్యక్తులు చనిపోయారు. వ్యాపారస్థుల 3 సం။ల చిన్న బిడ్డ తల్లిదండ్రులను కోల్పోయి సజీవురాలిగా మిగిలింది.

మరో వార్తలో ఓ స్త్రీ దీపావళి పండుగ సంబరంగా జరుపుకొనుటకు తోటి మిత్రురాలితో చెన్నై నుండి కేరళకు వెళ్తుంది. చెన్నై నుండి కేరళకు

వెళ్తున్న ఆ బస్ అదుపు తప్పి ఓ వ్యాన్‌ను ఢీ కొట్టింది. వ్యాన్‌లో ఉన్న 7 అడుగుల తుప్పుపట్టిన ఇనుపరాడ్ బస్ వెనుక సీట్‌లో కూర్చున్న ఈమె నడుంనుండి పొట్టలోకి దూసుకొని పోయి ప్రక్కనున్న స్త్రీ గొంతులోకి దూసుకొని పోయింది. ఎంత వేగంగా ఢీకొట్టిందంటే ఆ ఇనుపరాడ్ ఈమె పొట్ట, ప్రేవులు, లివర్ అంతా కోసికొని మరో స్త్రీ గొంతులో గ్రుచ్చుకుంది. ఆమె అక్కడికక్కడే చనిపోయింది. ఈమె ప్రాణంతో కొట్టుమిట్టాడుతుంటే ఆమెను బ్రతికించుటకు సహాయక బృందం గ్యాస్ కట్టర్‌తో ఇనుపరాడ్స్ అన్నీ కోసి బస్ సీటుతో పాటు హాస్పిటల్‌కు చేర్చారు. డాక్టర్స్ 6 గంటలు పోరాడి ఆఖరికి ఆమె నుండి ఆ రాడ్ తీయగలిగారు. తుప్పుపట్టిన ఆ రాడ్ వలన ఆమె లివర్, ప్రేవులు, కడుపు, వీపు అంతా పాడై భయంకరమైన పరిస్థితిలో ఉంది. తర్వాత ఆమె బ్రతికిందో లేదో తెలియదు. ఇలాంటి భయంకరమైన లోకంలో మనం ఉన్నాం మనం గర్వించడానికి ఏమీ లేదు. నేను రేపు ఈ పని ఎల్లుండి ఆ పని, వచ్చే సంవత్సరం మరొకటి చేస్తానని చెప్పలేము. దేవుని దయ, కనికరం నీపై లేకుంటే నీవు ఏదీ చేయలేవు. దేవుడు నిమిష నిమిషం మనల్ని కాపాడుతున్నాడు. కోడి రెక్కల క్రింద తనపిల్లల్ని కాపాడురీతిగా యెహోవా మనల్ని కాపాడుతున్నాడు. కావున దేవుని బిడ్డలు మాట్లాడుతున్నప్పుడు జాగ్రత్తగా మాట్లాడాలి. దేవుని చిత్తమైతే నేను ఇది చేస్తానని అనాలి.

**"నేడైనను రేపైనను ఒకానొక పట్టణమునకు వెళ్ళి అక్కడ ఒక సంవత్సరముండి వ్యాపారముచేసి లాభము సంపాదింతము రండని చెప్పుకొనువారలారా, రేపేమి సంభవించునో మీకు తెలియదు. మీ జీవమేపాటిది? మీరు కొంతసేపు కనబడి అంతలో మాయమైపోవు ఆవిరి వంటివారే కనుక– ప్రభువు చిత్తమైతే మనము బ్రదికియుండి ఇది అది చేతమని చెప్పుకొనవలెను. ఇప్పుడైతే మీరు మీ డంబములయందు అతిశయ పడుచున్నారు. ఇట్టి అతిశయమంతయు చెడ్డది. కాబట్టి మేలైనది చేయనెరిగియు ఆలాగు చేయనివానికి పాపము కలుగును."**

– యాకోబు 4:13–17

దేవుని చిత్తము అని అంటుండాలి. ప్రభువు చిత్తమైతే నేను రేపు మీ గృహానికి వస్తాను అనాలి. ఎంత గొప్పగా ఉంటుంది. నీవు దేవునిమీద ఆనుకుంటున్నావని జనులు నీ మాటలద్వారా గ్రహించాలి. ఆ సత్యాన్ని వారూ నేర్చుకోవాలి.

నీ చేతనైన సహాయం ఏనాడు చేయాలో ఆనాడే చేయి. నీవు ఒకరికి సహాయం చేసే స్తోమత కలిగి ఉండి ఈరోజు కాదు రేపు రమ్మని అనకూడదు. నీవు ఆ మేలు చేయడానికి రేపు బ్రతికి ఉంటావో లేదో తెలియదు. మేలైనది చేయనెరిగి చేయకుంటే అది పాపం అవుతుంది.

మన జీవితము ఏపాటిది? నీవు బయటకు వెళ్తున్నప్పుడు ప్రార్థించడం అలవాటు చేసికోవాలి. బజారు, పెళ్లి, ఉద్యోగం, ఎక్కడికి వెళ్తున్నా నీ తలవంచి ప్రభువా! నేను ఫలానా పనికొరకు వెళ్తున్నాను, నా ప్రాణాత్మదేహములను కాపాడు, నీ దూతల పరిచర్య నాకు దయచేయి. సురక్షితముగా నన్ను నా గృహానికి చేర్చుమని ప్రార్థించాలి.

ఎందరో హడావుడిగా ఏదో సాధిస్తామని బయటకు వెళ్ళి తిరిగిరాని లోకాలకు వెళ్ళిపోతున్నారు. కాళ్ళు, చేతులు విరిగి హాస్పిటల్‌లో ఎన్నో నెలలు బాధలు పడేదానికన్నా ప్రార్థించి ఈ వాగ్దానాన్ని స్వతంత్రించుకోవాలి. దేవుని పిల్లలకు ఇదొక గొప్ప వాగ్దానం. ఇది అందరికీ చెందిన వాగ్దానం కాదు. యేసుక్రీస్తులో ఉన్నవారు, ప్రభువులో నిలిచియున్నవారు పొందే ఆశీర్వాదం ఇది.

కొందరు మేము రోడ్డుమీద సరిగ్గా నడిస్తే మాకు ఏ అపాయం రాదు అనుకొంటారు. నీకు తప్పక ప్రమాదం సంభవిస్తుంది. సీతాఫలం పండ్లు అమ్మేవారు రోజు ప్రకారమే అమ్ముతున్నారు కొనేవారు రోజు ప్రకారంగానే కొంటున్నారు. కాని ఆ రోజు ఆర్.టి.సి. డ్రైవర్ నైట్ డ్యూటీ చేసి నిద్రలేకుండా బస్సు నడిపి నిద్రమత్తులో బస్ వారిమీదిగుండా తీసికెళ్ళాడు. బస్ అదుపు తప్పింది. ఇట్టి ప్రమాదాలనుండి దేవుడు మనల్ని విడిపిస్తాడు. ఇది మొదలుకొని నిరంతరము నీ రాకపోకలయందు యెహోవా నిన్ను కాపాడుతాడు.

– సశేషం

## యు.పి.ఎఫ్. క్రిస్మస్ వేడుకలు

18.12.2015, శుక్రవారము సా॥ 5 గం॥ల నుండి రా॥ 9 గం॥ల వరకు యు.పి.ఎఫ్. క్రిస్మస్ వేడుకలు ఉస్మానియా గార్డెన్, అడిక్‌మెట్‌లో జయకరంగా జరిగాయి. బిషప్ మాథ్యూ మీగర్‌గారు కుటుంబముగా పాల్గొని దేవునికి అసాధ్యమైనది ఏదైనా ఉన్నదా! అనే క్రిస్మస్ వర్తమానము అందించారు. రెవ.డా. జాయ్ చెరియన్ గారు క్రిస్మస్ శుభములు తెలియజేసి కేక్ కటింగ్ చేశారు. 'బలిపీఠం మీద నిత్యం అగ్ని మండుచుండవలెను' అనే వి.సి.డి., 2016 తెలుగు మరియు ఇంగ్లీష్ క్యాలెండర్లు, నవంబర్–డిసెంబర్ '15 దెబోరా స్వరం విడుదలైనవి. ప్రముఖ దైవజనులు, విశ్వాసులు, జనులు పాల్గొన్నారు. ఫంక్షన్ హాల్ ప్రాంగణమంతా నిండిపోయింది. సాంస్కృతిక కార్యక్రమాలు క్యాండిల్‌లైట్ సర్వీస్‌తో క్రిస్మస్ వేడుక ఎంతో ఆహ్లాదకరంగా జరిగింది. కేక్, వాగ్దానాలు, క్రొత్త దెబోరా స్వరం అందరికీ పంచడం జరిగింది.

**దయచేసి గమనించండి** UPF Ph. 040-27624030, 27624031

"యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్" పరిచర్యలకు మీరు పంపదలచిన విరాళాలను బ్యాంకు ద్వారా మాకు పంపగలరు.
మీరు ఈ సదవకాశాన్ని వినియోగించుకొని దేవుని సేవలో తోడ్పడగలరు.

బ్యాంకు మరియు ఖాతా వివరాలు :

**United Peoples Fellowship, Current a/c no. 133911100000946 Andhra Bank, Ramnagar.**

IFSC Code ANDB0001339 ఐ.ఎఫ్.ఎస్.సి. కోడ్ ANDB0001339

ఆన్‌లైన్ ద్వారా విరాళము పంపేవారు పంపిన తేది, పూర్తి పేరు, చిరునామా, ఫోన్ నెంబర్ తెలియపరచగలరు.

## క్రిస్మస్ ఆరాధన

25.12.2015, శుక్రవారము ఉ॥ 6 గం॥ల నుండి ఉ॥ 10 గం॥ల వరకు రాంనగర్ ఆలయంలో క్రిస్మస్ ఆరాధన జయకరంగా జరిగింది. రెవ. డా. జాయ్ చెరియన్ గారు "ఆ వాక్యము శరీరధారియై..." అనే క్రిస్మస్ వర్తమానము అందించారు. బ్రదర్ చెరియన్ గారు క్రిస్మస్ శుభములు తెలిపారు. "పరలోక రాజ్యపు తాళపు చెవులు" అనే వి.సి.డి. విడుదలైంది. ముషీరాబాద్ నియోజకవర్గ బి.జె.పి. ఎం.ఎల్.ఎ. డా॥ లక్ష్మణ్ గారు & బృందం పాల్గొని శుభములు తెలియజేశారు. బ్రదర్ చెరియన్ గారు, రెవ.డా.జాయ్ చెరియన్ గారు వ్యక్తిగతంగా ఒక్కో విశ్వాసిని కలిసి శుభములు ఆశీర్వాదములు పలికారు.

## సంపూర్ణరాత్రి ప్రార్థన

30.12.2015, చివరి బుధవారం రాత్రి 9 గం॥ల నుండి ఉ॥ 5 గం॥ల వరకు సెంటినరీ బాప్టిస్ట్ చర్చ్, సికింద్రాబాద్‌లో జయకరంగా జరిగింది. రెవ.డా. జాయ్ చెరియన్ గారు "నీవు కన్నీళ్లు విడుచుట చూచితిని", పాస్టర్ కె.వి. జార్జ్‌గారు , ఫిలిప్పీ 4:13, డా॥ సామ్సన్ గారు 'ఆత్మీయ ఎదుగుదల' గూర్చి వర్తమానం అందించారు. దేశంకొరకు, అధికారులకొరకు, సంఘములకొరకు మొదలైన ఇతర అంశములకొరకు ప్రార్థనలు జరిగినవి.

## వాచ్‌నైట్ సర్వీస్

31.12.15, గురువారం జడ్.బి. గార్డెన్‌లో రాత్రి 8 గం॥ల నుండి రాత్రి 1 గం॥వరకు వాచ్‌నైట్ సర్వీస్ జయకరంగా జరిగింది. ప్రార్థన, స్తుతి ఆరాధన జరిగింది. రెవ. డా. జాయ్ చెరియన్ గారు ప్రార్థించి దేవుడు చేసిన మేలులను స్తుతించి "ప్రతి విషయంలోను ప్రార్థన విజ్ఞాపనముల చేత కృతజ్ఞతాపూర్వకంగా మీ విన్నపములు దేవునికి తెలియజేయుడి" అనే వర్తమానము అందించారు. కేక్ కట్ చేసి ఓ చిన్న బిడ్డకు యు.పి.ఎఫ్. సంఘ రిప్రజెంట్‌గా కేక్ తినిపించారు. యు.పి.ఎఫ్. లో 2015 వ సం॥ము లో దేవుడు చేసిన మేలులన్నిటికొరకు సంఘమంతా దేవుని స్తుతించారు. వాగ్దానములు, 2016లో దేవుడు చేయవలసిన కార్యములు షీట్స్ ఇవ్వబడినవి. వాటికొరకు అమ్మగారు ప్రార్థించారు.

## నూతన సంవత్సర ఆరాధన

01.01.2016, శుక్రవారం ఉ॥ 6 గం॥లనుండి ఉ॥ 10 గం॥ల వరకు నూతన సంవత్సర ఆరాధన రాంనగర్ ఆలయంలో జయకరంగా జరిగింది. సంఘము, ప్రార్థన గోపురం, ప్రాగణం అంతా జనులతో నిండిపోయింది. రెవ. డా॥ జాయ్ చెరియన్ గారు 'నీ వాక్యము నన్ను బ్రదికించియున్నది', బ్రదర్ చెరియన్ గారు 'భయపడకుము' అనే వర్తమానం అందించి నూతన సంవత్సర శుభములు పలికారు. నూతన సంవత్సర వాగ్దానముల ఇవ్వబడినవి. బ్రదర్ చెరియన్ గారు, రెవ. డా. జాయ్ చెరియన్ గారు విశ్వాసులందరిని వ్యక్తిగతంగా శుభములు, ఆశీర్వాదములు పలికారు.

## కృతజ్ఞత కూడిక

యు.పి.ఎఫ్. సంస్థాపక అధ్యక్షురాలైన రెవ.డా. జాయ్ చెరియన్ గారి జన్మదిన సందర్భముగా 23-1-2016న అడిక్‌మెట్‌లోని ఉస్మానియా గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఉ॥ 10 గం॥ల నుండి సా॥ 4 గం॥ల వరకు కృతజ్ఞత కూడిక ఏర్పాటు చేయబడింది.

ప్రార్థనతో ప్రారంభించారు. యు.పి.ఎఫ్. పాస్టర్లు మరియు ప్రార్థన వీరులు అందరూ ప్రారంభ ప్రార్థనలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. డి.ఐ.జి. శ్రీ స్టీఫెన్ రవీంద్ర గారు కుటుంబ సమేతముగా పాల్గొని రెవ. డా. జాయ్ చెరియన్ గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. రెవ.డా. జి. సామ్యేల్ గారు, రెవ. డా. జయవంత్ సామ్యేల్ గారు, రెవ.టి.ఎం. కుమార్ గారు, రెవ. బి. సామ్యేల్‌బాబు గారు, సహో. శాంతి సుధాకర్ గారు మరియు సహో. జక్కుల బెన్హర్ గారు (రక్షణ టి.వి. ఎం.డి.), రెవ. కె. విజయకుమార్ గారు (సి.బి.సి.) మరియు ఇతర సేవకులు పాల్గొని జన్మదిన శుభములు తెలియజేశారు.

అమలాపురం నుండి వచ్చిన సేవకులు సహో. చెరియన్ గారిని, రెవ. డా. జాయ్ చెరియన్ గారిని శాలువాకప్పి పూలమాలలతో సత్కరించారు. రెవ. డా. జాయ్ చెరియన్ గారు - నీతిమంతులైన తన తల్లిదండ్రులను, వారి సేవను జ్ఞాపకము చేసి దేవుని స్తుతించారు. జాయ్ చెరియన్ గారి విరచితమైన "దేవుని వెయ్యి వాగ్దానముల" ప్రసంగాల పుస్తకము మొదటి భాగమును రెవ. డా. జి. సామ్యేల్ గారు ఆవిష్కరించారు. స్త్రీలు - పరిశుద్ధత, పరిశుభ్రత మరియు ప్రభువా, నాకు సహాయము చేయుము అనే వి.సి.డి.లను రెవ.డా.జి. సామ్యేల్ గారి సతీమణి ఈవా సామ్యేల్ గారి ద్వారా విడుదల చేయబడ్డాయి.

కూడికకు పాల్గొన్నవారందరూ ప్రేమ విందులో పాల్గొని దేవుని మహిమపరచారు. మంచి వాతావరణ పరిస్థితులు దయచేసి కూడికను జయకరంగా జరిగించుటకు కృపచూపిన దేవునికి సమస్త ఘనత మహిమ ప్రభావములు చెల్లిస్తున్నాము.

## యూత్ రిట్రీట్

గణతంత్ర దినోత్సవ సందర్భముగా 26-1-2016న ఉ॥ 10 గం॥ల నుండి సా॥ 6 గం॥ల వరకు యు.పి.ఎఫ్. రాంనగర్‌లో "యూత్ రిట్రీట్" జరిగింది.

ప్రార్థనతో ప్రారంభించి పాటలుపాడి దేవుని మహిమ పరచారు. డా॥ శామ్సన్ గారు **"ప్రభువులో ఎదుగుదల"** అనే అంశముపై ప్రసంగించారు. డా॥ సునిల్ శామ్ దేవిడ్ గారు **"నమ్మకస్థులైన తల్లిదండ్రులు"** అనే అంశము వివరించారు. డా॥ సొలొమోను గారు తన సాక్ష్యమును పంచుకున్నారు. డా॥ సునిల్‌శామ్ దేవిడ్ గారు ఆర్గనైజేషన్ ఎలా ఉండాలో వివరించారు. యౌవనస్థుల ప్రార్థన అవసరతల నిమిత్తం ప్రార్థించారు. చివరిగా **"ద జెర్నీ ఇన్ ద వ్యాలీ ఆఫ్ బాకా టు బెరాకా"** అనే అంశముపై డా॥ శామ్సన్‌గారు ఉపదేశం అందించారు.

అందరూ తేనీరు మరియు ప్రేమవిందు స్వీకరించారు.

జాయ్ చెరియన్ అమ్మగారు యౌవనస్థులందరికీ ప్రార్థన నూనె రాచి ప్రార్థించారు. అందరూ వాగ్దానం పొందారు.

రిట్రీట్ జయకరంగా జరిగించి మంచి ఏర్పాట్లు దయచేసిన దేవునికే సమస్త మహిమ చెల్లునుగాక!

# దేవుని వెయ్యి ఆదేశములు

ధారావాహిక

## 94. "రెండు అంగీలుగలవాడు ఏమియు లేనివానికియ్యవలెను." - లూకా 3:11

ఇక్కడ బాప్తిస్మమిచ్చు యోహాను జనులకు ఈ ఆదేశము ఇస్తున్నాడు. **"మారుమనస్సునకు తగిన ఫలములు ఫలించుడి... ఇప్పుడే గొడ్డలి చెట్ల వేరున ఉంచబడియున్నది గనుక మంచి ఫలము ఫలించని ప్రతి చెట్టును నరకబడి అగ్నిలో వేయబడునని చెప్పెను."** - లూకా 3:8,9. అప్పుడు జనులు దానికి మేమేమి చేయాలని అడిగినప్పుడు రెండు అంగీలుంటే ఒకటి లేనివారికి ఇవ్వాలని చెబుతున్నాడు. స్వార్థము, దురాశ, దుర్వ్యామోహము ఉండొద్దని అర్థము. రెండుంటే ఒకటి ఇచ్చేటంత దైవికమైన మనస్సు నీకు ఉండాలి. దేవుడు నీకు ధారాళంగా ఇచ్చినప్పుడు నీకు కలిగిన వాటిని పేదవారితో పంచుకోవాలి. 50జతల బట్టలు ఉంటే 25 ఇతరులకు ఇచ్చేయాలని అనుకునేకన్నా నీవు ఇతరుల గురించికూడ ఆలోచించాలని అర్థం చేసికోవాలి. ఒకసారి ఒక సహోదరి తన పిల్లల బట్టలు తెచ్చి పేదవారికని ఇచ్చింది. నాకు చాలా సంతోషమనిపించింది. దేవుడు వారికి చాలా ఇచ్చాడు. ఆమె తెచ్చినవన్నీ క్రొత్తగానే ఉన్నాయి. పాత, పికిలి, చినిగిపోయినవి కాదు. మంచివేగాని వారి స్థాయికి పాతబడినవి. కాని పేదవారికవి క్రొత్తవే. ఎంతో మందికి వాటిని పంచాను. వారెంతో మురిసిపోయారు. వారికి ఆ స్థాయి లేదు కాబట్టి దొరికినవే వారికి ప్రశస్తంగా ఉన్నాయి. దేవుడు నిన్ను ఎంతగానో హెచ్చించినప్పుడు పేదవారిమీద కూడ నీకు శ్రద్ధ ఉండాలి. చాలా మంది పేదవారిగురించి అసలు ఆలోచించరు. అన్నము ఎక్కువగా వండేస్తారు. మిగిలిపోయినప్పుడు సఫాయివారికి, పేదవారికి, ఇంటిపని చేసేవారికి, ఏమీలేనివారికి ఆ ఆహారమును వేడిచేసి తినేవీలుండేటట్లుగా పోపువేసి పెడితే కడుపార తిని నీ బిడ్డలు చల్లగా ఉండనీ అని ఆశీర్వదించరా? కాని దాన్ని పాడుచేసి పడేస్తే నీకు దీవెన రాదు. నీకున్న వాటిని ఇతరులకు పంచే బుద్ధి ఉండాలి.

ప్రతివాడు తన సొంత కార్యములనే కాక ఇతరుల కార్యములు కూడా చూడాలని వాక్యములో ఉంది. ఒక సహోదరి నా దగ్గరికి వచ్చి అమ్మా! దేవుడు నన్ను ఎంతగానో దీవించాడు. ఒక అలమరా నిండిపోయినందున ఇంకొకటి కొన్నాను అని చెప్పింది. దేవుడు పట్టజాలనంతగా దీవిస్తాడు. అలాగు దీవించాడని చెప్పి ఇతరుల గురించి శ్రద్ధలేకుంటే దానివలన ప్రయోజనము లేదు. పేదవారు, బీదవారు వచ్చినప్పుడు కొద్దిగానైనా సహాయం చేయాలి. క్రియలు లేని విశ్వాసము మృతము. భక్తి కేవలము నీ నోటిద్వారానే కాదు, క్రియారూపకంగా ఉండాలి. అమలులోకి తీసికొనిరావాలి.

**"దేవుడొక్కడే అని నీవు నమ్ముచున్నావు. అలాగు నమ్ముట మంచిదే; దయ్యములును నమ్మి వణకుచున్నవి. వ్యర్థుడా, క్రియలులేని విశ్వాసము నిష్ఫలమైనదని తెలిసికొనగోరుచున్నావా? మన పితరుడైన అబ్రాహాము తన కుమారుడైన ఇస్సాకును బలిపీఠముమీద అర్పించినప్పుడు అతడు క్రియలవలన నీతిమంతుడని తీర్పు పొందలేదా? విశ్వాసము అతని క్రియలతోకూడి కార్యసిద్ధి కలుగజేసెననియు, క్రియలమూలముగా అతని విశ్వాసము పరిపూర్ణమైనదనియు గ్రహించుచున్నావు గదా?"** - యాకోబు 2:19-22. క్రియలద్వారా మన విశ్వాసము పరిపూర్ణమౌతుంది. ఈ రోజుల్లో చెప్పేవారు ఎక్కువగా, చేసేవారు తక్కువగా కనబడుతున్నారు. చెప్పాలి, చేయాలి. అట్టివారిని దేవుడు గొప్పగా ఆశీర్వదిస్తాడు. క్రీస్తు ప్రేమను ఇతరులకు ప్రకటించాలి.

ఏ పని చేసినా జ్ఞానముతో చేయాలి. మా ఇంటి ముందుకి ఒక భిక్షగాడు తరచుగా వస్తాడు. ఎప్పుడు వచ్చినా బట్టలే అడుగుతాడు. రొట్టెలిస్తే వద్దంటాడు. డబ్బులు వద్దంటాడు. బెడ్‌షీట్స్, ప్యాంట్స్, షర్ట్స్ కావాలంటాడు. ఏం చేస్తాడో నాకు అర్థము కాదు. ఎప్పుడు చూసినా ఒకే లుంగీకట్టుకొని దుప్పటి వేసికొనివస్తాడు. ధనవంతుల ఇండ్లనుండి ఇలాగు సేకరించి ఎక్కడైనా అమ్ముకుంటాడో ఏమో తెలియదు. ఇలాంటి మోసగాళ్లుకూడ ఉంటారు. కొందరు చలిలో వణుకుతూ వచ్చినప్పుడు నీవు వారికి దుప్పటి, బట్టలు ఇవ్వకుంటే ఏమి ప్రయోజనము? దేవుడు నీకు ఇచ్చిన వాటిలో కొంత వారికిచ్చి సహాయం చేయడం యేసు క్రీస్తు మనస్సు. నీవు మొదట వాని అవసరతలు తీర్చాలి. తర్వాత సువార్త చెబితే దానినతడు అంగీకరిస్తాడు. ఆకలిగొని నీ ఇంటికి వచ్చినప్పుడు సువార్త చెబితే వారికేమీ అర్థము కాదు. మొదట వారికి ఆహారము పెట్టాలి. **యు.పి.ఎఫ్.**ను దేవుడు ఇంతగా ఆశీర్వదించుటకు మాటలే కాదు, క్రియారూపకంగాకూడ ఇతరులకు సహాయము చేస్తాము. ఆకలైతే ఆహారము పెడతాము. ఒకసారి 'దిబ్బయ్య' అనే వ్యక్తి ఏదో ఊరి నుండి ఇక్కడికి వచ్చాడు. 52 సంవత్సరముల వయస్సు. పిల్లలున్నారు. వారిని పెంచి పెద్దచేశాడు. ఇప్పుడు అతన్ని ఎవరూ చూడడము లేదు. ఇక్కడ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఎంతో నిరాశ, ఆత్మహత్య తలంపులతో ఉన్నాడు. కుటుంబమంతా ఎక్కడో ఉంది. అన్నము వండుకోవడంలేదు. డబ్బు లేదు. ఎంతో డిప్రెషన్‌లో ఉన్నాడు. కనుబొమ్మలు నిలబడడం లేదు. అప్పుడు నేనొక పెద్ద ప్రసంగము చేస్తే అతనికి అర్థమవుతుందా? మొదట కాళ్లు, చేతులు కడుగుకొనమని చెప్పి పళ్లెములో ఆహారము పెట్టి ప్రార్థన చేసి ఇచ్చాను. తిన్న తర్వాత అతని ముఖమెంతో వెలిగిపోయింది. అతనికి కావలసింది ఆదరణ, అతన్ని అర్థము చేసికోవడము. క్రియారూపకంగా నీ విశ్వాసము పరిపూర్ణంగా ఉండాలి. ఇతరుల అవసరతల్లో నీవు పాలుపొందాలి. అన్నీ మనమే సంపాదించాలి, అనుభవించాలంటే సాధ్యము కాదు. సంపాదిస్తావేమో కాని అనుభవించేది దేవుని వశములో ఉంది. కోట్లు సంపాదించినా గుటికెడు నీళ్లు మ్రింగాలన్నా, ముద్ద ఆహారము తినాలన్నా దేవుని దయ కావాలి. **"అన్నపానములు పుచ్చుకొనుటకంటెను, తన కష్టార్జితముచేత సుఖపడుటకంటెను నరునికి మేలుకరమైనదేదియులేదు. ఇదియును దేవునివలన కలుగునని నేను తెలిసికొంటిని. ఆయన సెలవులేక భోజనముచేసి సంతోషించుట ఎవరికి సాధ్యము? ఏలయనగా దైవదృష్టికి మంచివాడుగా నుండువానికి దేవుడు జ్ఞానమును తెలివిని ఆనందమును అనుగ్రహించును; అయితే దైవదృష్టికి ఇష్టుడగువాని కిచ్చుటకై ప్రయాసపడి పోగుచేయు పనిని ఆయన పాపాత్మునికి నిర్ణయించును."** - ప్రసంగి 2:24-26. నీవు పరిశుద్ధంగా లేకుండా పాపంలో డబ్బు సంపాదించ ప్రయత్నిస్తే అది నీకు కాదు, నీవు కూడబెట్టినది దేవుని బిడ్డల వశమౌతుంది. వారు దేవునికి ఇష్టులు కాబట్టి వారు నిద్రిస్తుండగా వారికి ఆహారము సిద్ధపరుస్తాడు. వారి అక్కరలు తీర్చడానికి ప్రయాసపడి పోగుచేసే పనిని పాపాత్ములకు అప్పగిస్తాడు. అది దైవకార్యం. కావున దైవభయం ఉండాలి. నీకు ఉన్నవాటిని లేనివారితో పంచుకోవాలి.

## 95. "మీకు నిర్ణయింపబడినదానికంటె ఎక్కువ తీసికొనవద్దు." – లూకా 3:13

ఈ ఆదేశము సుంకరులకు ఇవ్వబడింది. దేవుడు మీకు ఏదైతే నిర్ణయించాడో అంత మట్టుకే మీవద్ద ఉంచుకోవాలి. ఆశతో దానికి మించి కూర్చుకోవద్దు. ఇశ్రాయేలు ప్రజలు అరణ్యములో ప్రయాణిస్తుండగా దేవుడు ఆకాశమునుండి మన్నాను కురిపించాడు. ఆ దినం మట్టుకే ఆహారము కూర్చుకొనుడి అని ఆదేశము ఇచ్చాడు. వారు అత్యాశతో ఎక్కువగా కూర్చుకుంటే అది పురుగుపట్టి కుళ్ళిపోయింది. మీ జీతమే గాని, బత్తెమేగాని మీకు ఎంతైతే కేటాయించబడిందో అంతమట్టుకే తీసికోవాలి. కొందరికి వారి జీతములతో తృప్తి ఉండదు. కొందరు స్త్రీలు భర్త తెచ్చిన జీతంతో తృప్తిపడరు. అప్పుడు వారు ప్రక్కింటివారితో, ఇతరులతో పోల్చుతుంటారు. వారెంత లంచము తీసికొస్తారు, నీకు ఏమీ తెలియదు అని భర్తలను పాడుచేస్తారు. ఇలాగు భర్తలను నిర్ణయింపబడిన దానికన్నా ఎక్కువ తీసికొని రావాలని ప్రోత్సహిస్తుంటారు. దేవుడిచ్చిన కొద్దిపాటితో ఆకుకూరల భోజనము భుజించి సమాధానంతో, నెమ్మదితో దేవుని స్తుతించి ఏ దుర్వ్యాపారము లేకుండా దైవచిత్త ప్రకారము బ్రతకడము ఎంత మేలు. కాని లేని సొమ్మును, అన్యుల కష్టార్జితమును తీసికొనివస్తే వాని కూలి నీ ఇంటినుండి దేవునికి మొఱ్ఱపెడుతుంది. కొందరు వడ్డీ వ్యాపారం చేస్తారు. దేవుడిచ్చిన దాన్ని తిని తృప్తిగా ఉంటే పిల్లలమీదికి ఆశీర్వాదము వస్తుంది. దేవుడు అన్యాయస్థుడు కాడు. కాని లక్షరూపాయలు వడ్డీకిస్తే నెలకు 20, 30 వేలు వస్తాయని దురాశపడతారు. కాని వడ్డీ కట్టేవాడు సంతోషంతో ఇస్తున్నాడా? వీరు నాశనం కావాలి. పిల్లలు పాడుకావాలి అని ఎంత తిట్టుకుంటాడో. నా చెమట, నా కష్టార్జితమును వీరికి ధారపోస్తున్నా ననుకుంటాడు. వారి బాధ, చెమట, ఉసురు నీవు ఇంటికి తీసికొస్తే ఎప్పటికీ బాగుపడవు. అందుకే లంచగొండుల గృహాలు పతనమైపోవడం, వారు అకాల మరణము పొందడమును తరచుగా చూస్తుంటాము. లంచము తీసికొనేవారి నోరు మట్టితో నింపబడుతుందని వాక్యములో ఉంది. అంటే తొందరగా భూస్థాపన అయిపోతుందని అర్థము. వానికి అన్నము తినడానికి వీలుకాదు. అన్యాయపు సొమ్మును అనుభవించేవారు తనవికాని గుడ్లను పొదుగు కౌజుపిట్టతో సమానుడని వాక్యములో ఉంది. కౌజుపిట్ట తన గుడ్లను కాక వేరే గుడ్లను పొదిగి పిల్లలు బయటికి రాగానే తన పిల్లలు కావని ఎగిరిపోతుంది. అంతగా ఎదురు చూసింది, ప్రయాసపడింది వ్యర్థమైపోతుంది. పనివాడు జీతమునకు పాత్రుడు. పనిచేసిన దానికి తగిన జీతమే తీసికోవాలి.

ఆ ఖర్చు – ఈ ఖర్చు అని దొంగ బిల్స్ వేయడం కొందరు ఉద్యోగస్తులకు అలవాటే. దానివలన మీకు ఏ ప్రయోజనము ఉండదు. కాని అంతకన్నా ఎన్నోరెట్లు ఆయాసకరమైన మార్గములోకి వెళ్లిపోతావు. డాక్టర్స్, కోర్ట్స్, పోలీస్‌స్టేషన్ అని లెక్కలేనంతగా నీ కష్టార్జితము చిల్లుబడిన సంచిలో వేసినట్లు అయిపోతుంది. కావున దైవభక్తితో కూడిన కొంచెమే శ్రేష్ఠము.

**"సంతుష్టి సహితమైన దైవభక్తి గొప్పలాభసాధనమై యున్నది. మనమీలోకములోనికి ఏమియు తేలేదు, దీనిలోనుండి ఏమియు తీసికొని పోలేము. కాగా అన్నవస్త్రములు గలవారమై యుండి వాటితో తృప్తిపొందియుందము. ధనవంతులగుటకు అపేక్షించువారు శోధనలోను, ఉరిలోను, అవివేకయుక్తములును హానికరములునైన అనేక దురాశలలోను పడుదురు. అట్టివి మనుష్యులను నష్టములోను నాశనములోను ముంచివేయును. ఎందుకనగా ధనాపేక్ష సమస్తమైన కీడులకు మూలము; కొందరు దానిని ఆశించి విశ్వాసమునుండి తొలగిపోయి నానాబాధలతో తమ్మును తామే పొడుచుకొనిరి."** – 1 తిమోతి 6:6–10

చాలా మంది ఎన్నెన్నో స్కీమ్స్ అని దురాశలకు పోతారు. ఒక సహోదరుడు నా దగ్గరికి వచ్చి చెప్పాడు. అతను చిట్టీల వ్యాపారము చేశాడట. అన్నీ నష్టపోయాడట. చిట్టీకట్టిన వారందరు ప్రాణము మీదికి వస్తున్నారట. ఆత్మహత్య చేసికుంటానంటున్నాడు. దురాశ దుఃఖమునకు చేటు. నీకున్న కొంచెములో తృప్తిగా ఉంటే అదే అతిశ్రేష్ఠము. ధనము ఆర్జించాలని, కూర్చుకోవాలని ఆశించవద్దు. పొరుగువాని క్షేమము చూచి క్రుంగిపోవద్దు. లోకాశలతట్టు చూస్తే హాని వస్తుంది. అంతా కూర్చుకున్నాక నీ ప్రాణము నిన్ను విడిచిపోతే నీకేమి ఫలితము? పాపపు ధనదోపునకు వెళ్లి, నీ ఇంటికి శాపమును తీసుకురాకు. మనిషి దేవునితట్టు చూడాలి. ఈ లోకరీతిగా దేనితట్టు చూసినా ఆయాసం, ప్రయాసం, దుఃఖం, బాధ, పాపం, శాపం నిన్ను అంటుకుంటుంది. ఈ లోకమాలిన్యము నీకు అంటకుండా చూసుకోవాలి. తామర పుష్పము బురదలోనే ఉంటుంది కాని దానికి బురద అంటదు. వికసించుటకు సూర్యకాంతికొరకు ఎదురుచూస్తుంది. మంచు బిందువులతో కూడి సువాసన వెదజల్లుతుంది. దాని అందమంతా సూర్యరశ్మిపై ఆధారపడి ఉంది. సూర్యుడు రాగానే విరబూస్తుంది. నీతి సూర్యుని ప్రకాశంతో దేవుని బిడ్డలుండాలి. నిర్ణయింపబడిన దానికన్న ఎక్కువ తీసికోవద్దు. నీది కాని దానిని నీవు ముట్టుకోవద్దు. ❁ – సశేషం


ప్రార్థించండి! పాల్గొనండి!!

"సిలువనుగూర్చిన వార్త, నశించుచున్న వారికి వెఱ్ఱితనము గాని రక్షింపబడుచున్న మనకు దేవుని శక్తి."– 1 కొరింథీ. 1:18

**యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ (UPF)**

1-9-52/E/3, రాంనగర్ ఈ-సేవ బస్ స్టాప్‌కు ఎదురుగా
ఉన్న గౌతమ్ హైస్కూల్ వీధి, మూడవ కుడి మలుపు,
రాంనగర్, హైదరాబాద్-500 020. (T.S.)
ఫోన్ : 040-27624030



**సిలువ ధ్యానములు**

40 రోజులు

తేదీలు : **2016 ఫిబ్రవరి 15 నుండి మార్చి 25వరకు**

సమయము : **ప్రతి రోజు ఉ॥ 4 గం॥ల నుండి ఉ॥ 7 గం॥ల వరకు**

స్థలము : **యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్, రాంనగర్, హైదరాబాద్.**

**విలువైన సిలువ వర్తమానములను అభిషిక్తుల ద్వారా వినండి! ఆత్మీయ ఆశీర్వాదములను పొందండి!! మీ అవసరతల నిమిత్తము ప్రత్యేక ప్రార్థనలు చేయబడును.**



**ఈస్టర్ ఆరాధన 27-3-2016**
ఉ॥ 6 గం॥ల నుండి 9-00 గం॥ల వరకు U.P.F. రాంనగర్.
సా॥ 5 గం॥ల నుండి 8-30 ని॥ల వరకు
ఉస్మానియా గార్డెన్ ఫంక్షన్ హాల్, అడిక్‌మెట్, హైదరాబాద్

ప్రభు సేవలో
**- జాయ్ చెరియన్**
ఫౌండర్ ప్రెసిడెంట్ (UPF)

**అందరికీ ఆహ్వానము**

"యెహోవా, ఉదయమున నా కంఠస్వరము నీకు వినబడును ఉదయమున నా ప్రార్థన నీ సన్నిధిని సిద్ధముచేసి కాచియుందును."– కీర్తన. 5:3

# దేవుడు చేసిన అద్భుతకార్యములు

**1. స్వరూపకుమారి, బోరబండ :** మాది మేనరిక వివాహం. దీని కారణంగా పుట్టే పిల్లలు ఎదుగుదల లేకుండా పుడుతున్నారు. మొదట పాపపుట్టి ఎదుగుదల లేక, కంటిచూపు సరిగా లేకుండా 5 సంవత్సరాలకు చనిపోయింది. తర్వాత పరీక్షలన్నీ చేయించుకొని చాలా డబ్బు ఖర్చుపెట్టి చూపించుకున్నాము. రెండవసారి పాప (జాయ్‌సీ) పుట్టి 3 నెలలైనా ఏమీ చూడలేక, గ్రహించలేక ఉంది. కళ్లకు క్యాటరాక్ట్ ఆపరేషన్ చేసి అద్దాలు ఇచ్చారు. ఆమెకూ ఎదుగుదల తక్కువగా ఉంది. 5 సంవత్సరాలైనా ఎదుగుదలలేక అంగవైకల్యముతో బాధపడుతుంది. కూర్చోలేదు. నడవలేదు. మా మొదటిపాప చనిపోయాక నా భర్త టి.వి. కొన్నాడు. అప్పటినుండి ఆరాధన టి.వి.లో 'జీవపుమాటలు' అను అమ్మగారి కార్యక్రమము చూస్తూ నా తల్లి లేకున్నా దేవుడు నాకు ఆత్మీయ తల్లిని ఇచ్చాడని సంతోషపడుతున్నాను. అమ్మగారు చెప్పే వాక్యంద్వారా నేను బ్రతికి ఉన్నాను. వాక్యంద్వారా ఎడతెగని ప్రార్థన, కన్నీటి ప్రార్థన, రాత్రి ప్రార్థన నేర్చుకొని ప్రార్థిస్తున్నాను. నాకు ఎప్పుడు బాధకలిగినా వెనువెంటనే కల్వరి, ఆరాధన టి.వి.లో 'జీవపు మాటలు' ద్వారా బలపడుతూ ఆత్మీయంగా ఎదుగుతున్నాను. నాకు పి.సి.ఓ.డి. (గర్భసంచిలో నీటి బుడగలు) సమస్య ఉంది. గనుక 2,3 నెలలకు పీరియడ్స్ వస్తాయి. అమ్మగారి వాక్యముద్వారా 3 సంవత్సరాలుగా (2013 నుండి 2015 వరకు) 40 రోజుల సిలువధ్యానములు చేశాను. 2015వ సం॥ము 40 రోజుల ప్రార్థనలో నా సమస్యపోయింది. ఈస్టర్ రోజున కడుపునొప్పి వస్తే డాక్టరు దగ్గరకు వెళ్తే ప్రెగ్నెంట్ అని చెప్పారు. ఆ డాక్టర్, నాతో నేను మిమ్మల్ని చూడలేను. మొదట ఇద్దరు ప్రాబ్లంతో పుట్టారు గనుక ఇదీ అలానే ఉంటుందేమో, మొదట జెనిటిక్స్ టెస్ట్ చేయించుకోండి. రిజల్ట్స్ నార్మల్ అయితే గర్భం ఉంటుంది. లేకుంటే గర్భము తొలగిస్తామన్నారు. నేను ఇక హాస్పిటల్‌కు వెళ్లలేదు, మందులు వాడలేదు. అమ్మగారి దగ్గరికి వచ్చి ప్రార్థన చేయించుకున్నాను. అమ్మగారు నా కడుపుపై చేయిపెట్టి నూనె రాసి 100% పర్ఫెక్ట్ బేబిని ఇవ్వు అని దేవుని ప్రార్థించారు. సాధారణంగా నెలకు 30, 40 వేలు ఖర్చు అవుతుంది. మేము 2 నెలలు కనిపెట్టి అమ్మగారు ప్రార్థించిన తర్వాత పరీక్షలకొరకు డయాగ్నోస్టిక్ సెంటర్‌కు వెళ్తే మా రెండో పాప రక్తము మరియు కడుపులో బిడ్డ రక్తము తీసి పరీక్షలు చేసి నిర్ణయిస్తామన్నారు. తర్వాత ఇద్దరికీ బయాప్సీ చేశారు. ఆ జెనిటిక్స్ పరీక్షల రిపోర్ట్ నార్మల్‌గా వచ్చింది. అయినా పెద్ద పాప అలా ఉంది గనుక లోపల బేబి ఎలా ఉందో తెలియదని స్కానింగ్ చేశారు. ఆవిధంగా 2000/- రూపాయలు మాత్రమే (స్కానింగ్ కొరకు) ఖర్చు అయ్యింది. స్కానింగ్ రిపోర్టు నార్మల్ వచ్చింది. లోపల బేబి కళ్లకు క్యాటరాక్ట్ లేదు, కాళ్ళు మిగతా శరీరము ఎదుగుదల అంతా బాగుందని చెప్పారు. శరీరములోని అన్ని భాగములు చక్కగా ఉన్నాయని చెప్పారు. 7వ నెలలో 2వ సారి స్కానింగ్ చేశారు. అంతా బాగుందని చెప్పారు.

7.11.15 న నాకు ప్రసవనొప్పులు వస్తున్నాయి. అప్పుడు మా వద్ద డబ్బులు లేవు. హాస్పిటల్‌కు వెళ్తే డాక్టర్స్ బేబి అడ్డం తిరిగిందని, ఆపరేషన్ చేయాలన్నారు. ఇష్టమైతే చేయించుకోండి లేకుంటే వెళ్లిపోండని అన్నారు. దేవుడు సహాయం చేశాడు. ఆపరేషన్ జరిగింది. పాప జన్మించింది. కాని ఉమ్మనీరు త్రాగేసిందని నిలోఫర్‌కు తీసికెళ్లమన్నారు. నా భర్త 108 కు ఫోన్ చేస్తే వారు నిలోఫర్ కు తీసికెళ్లారు. తెల్లవారుజాము 4 గం॥లకు యు.పి.ఎఫ్. ప్రేయర్‌టవర్‌కు ఫోన్ చేసి ప్రార్థన చేయించారు. ఆ రోజు ఉదయం పాపకు పరీక్షలు చేశారు. మా భారమంతా దేవునిపై వేశాము. 3వ రోజు (9.11.15) డిశ్చార్జ్ చేశారు. పాపకు అంతా తగ్గిపోయింది. 100% పర్ఫెక్ట్‌గా ఉందన్నారు. నా చిన్నప్పుడే నా తల్లిదండ్రులు చనిపోయారు. పిల్లలు ఎదుగుదలలేక పుడుతున్నారు. ఈ బిడ్డ ద్వారానైనా దేవుడు సంతోషం ఇవ్వాలని ఆశించాను. దేవుడు దైవసేవకురాలి మాటను రూఢీపరచి 100% పర్ఫెక్ట్ బేబిని అనుగ్రహించాడు. పాప అన్నివిధాల ఆరోగ్యంగా, చురుకుగా ఉంది. కంటిచూపుకూడా చాలా బాగుంది. అమ్మగారు 25.12.2015న మా పాపకు 'రూత్ రిజాయిస్' అని నామకరణం చేశారు. దేవునికి స్తోత్రములు. అమ్మగారికి వందనములు.

**2. సబిత గ్లోరి, రాంనగర్ :** దేవుడు 2015వ సంవత్సరంలో నాకు రెండు మేలులు చేశాడు. ఒకటి సెప్టెంబర్ 10, 2015న నాకు రెండవ కుమారుని ఇచ్చాడు. రెండవది 3.1.2015న పోయిన ద్విచక్ర వాహనం నవంబర్ 2015లో దొరికింది. నాకు వివాహమైన 3 సంవత్సరాలవరకు పిల్లలు కలుగలేదు. అమ్మగారి ప్రార్థనవలన దేవుడు నాకు చక్కని ఇద్దరు పిల్లలను ఇచ్చాడు. 3.1.2015న మా ద్విచక్రవాహనం పోయింది. అమ్మగారితో ప్రార్థన చేయించాను. అమ్మగారు తీసికున్నవారు మారుమనస్సు పొంది తిరిగి తెచ్చిపెట్టాలని ప్రార్థించారు. 19.2.2015న అధికారులు ఎఫ్.ఐ.ఆర్. వ్రాయించారు. అక్టోబరు 3,2015న ముషీరాబాద్ పోలీస్ స్టేషన్‌నుండి ఫోన్ వచ్చింది. మా బండి దొరికిందని చెప్పారు. బండి పార్ట్స్ ఏమీ పోలేదు. డామేజ్ ఏమీ కాలేదు. సికింద్రాబాద్ పోలీస్ స్టేషన్ వారికి దొరికింది. బండి ఎత్తుకెళ్లినవారు దాన్ని తెచ్చి అక్కడ పడేసి వెళ్లారు. పోలీస్ అధికారులు నవంబర్ 2015లో దాన్ని మా చేతికి అందించారు. నేను వెంటనే అమ్మగారికి ఫోన్ చేసి చెబితే అమ్మగారు ఎంతో సంతోషించారు. ఆ బండి లేకుంటే మాకేదో వెలితిగా ఉండేది. దేవుడు అమ్మగారి ప్రార్థన విని దాన్ని మాకు అనుగ్రహించాడు. దేవునికి స్తోత్రములు. అమ్మగారికి వందనములు.

**3. నిహారిక, సైనిక్‌పురి :** రెండు వారాల క్రితం (15.11.15 తేదీకి) డాక్టర్స్ నన్ను పరీక్షించి స్కానింగ్ చేసి పి.సి.ఓ.డి. (గర్భ సంచిలో నీటి బుడగలు) సమస్య ఉందన్నారు. 6 నెలలు మందులు వాడమన్నారు. నేను అమ్మగారి దగ్గరికి వచ్చి చెప్పినప్పుడు అమ్మగారు ప్రార్థించి ఏమీ కాదు తగ్గి పోతుందన్నారు. డాక్టర్ నాకు హై డోస్ మెడిసిన్ ఇచ్చాడు. నేను దేవుడు స్వస్థపరుస్తాడనే నమ్మకంతో ఉన్నాను. తర్వాత మరో డాక్టర్‌కు చూపిస్తే పరీక్షించి ఆ వ్యాధి లక్షణాలేమీ కనబడడం లేదు. స్కానింగ్‌లో అయితే ఉంది. మందులు వాడడం వల్ల సైడ్ ఎఫెక్ట్ వస్తుంది. గనుక మందులేమీ వాడొద్దు. దానంతట అదే తగ్గిపోతుంది అని చెప్పాడు. అమ్మగారు చెప్పిందే డాక్టర్ చెప్పాడు. దేవునికి స్తోత్రములు! అమ్మగారికి వందనములు.

**4. బి. వర్గీసురాజు, పశ్చిమగోదావరి జిల్లా :** నేను అమ్మగారు చెప్పిన వాక్యముచే రక్షింపబడ్డాను. నేనెంతో పాపపు బ్రతుకు బ్రతికినవాడను. అలాంటి నేను అమ్మగారి వాక్యముతో మారుమనస్సు, పాపక్షమాపణ పొందాను. 2009 వ సంవత్సరము నుండి అమ్మగారి వాక్యము వింటున్నాను. నేను మరణభయంతో బ్రతుకుతూ ఉండగా 2010వ సంవత్సరము ఏప్రిల్ 4వ తేది బాప్తిస్మం పొందాను. అప్పటినుండి భయభక్తులతో బ్రతుకుతున్నాను. 2011వ సంవత్సరము నాకు వివాహమైంది కాని నా భార్య నన్ను విడిచిపెట్టింది. ఆమె నన్ను విడనాడిన ఫలితంగా 2013న విడాకులు తీసికున్నాను. తదుపరి కాంట్రాక్ట్ ఉద్యోగంలో 8,500/- రూపాయల జీతంతో ప్రస్తుతం ఉద్యోగం చేస్తున్నాను. ఎంతో వేదనతో బ్రతుకుతున్న నాకు మరల వివాహం చేసికోవాలని అనిపించగా 2015 ఏప్రిల్ 11న ఒక విశ్వాసురాలయిన భార్యను దేవుని దయవలన పొందాను. దేవుని దయవలన ఆమె ఎంతో ప్రేమగా చూసుకొంటుంది. దేవుడు మమ్మును ఆశీర్వదించి గర్భఫలంకూడా అనుగ్రహించాడు. దేవునికి స్తోత్రములు. అమ్మగారికి వందనములు.

**5. పౌలిన్, రాంనగర్ :** మార్చి, 2015 నుండి మా పెద్దమ్మ కుమార్తె అరుణ (37సం॥లు) వివాహం కొరకు మందిరంలో ప్రార్థన విన్నపం ఇచ్చాను. మార్చి 11, 2015న మా పెద్దనాన్న చనిపోయాడు. అతను ఉన్నప్పుడే ఇద్దరు కుమారుల వివాహం జరిగింది కాని కుమార్తెకు కాలేదు. ఆమె ఈడు మీరిపోయింది. నేను ఆమెకు వివాహం కావడం లేదని మందిరంలో 24 గంటల గొలుసు ప్రార్థన, ఇతర కూడికల్లో ఆమె గురించి ప్రార్థన చేశాను. దేవుడు అద్భుతకార్యం చేశాడు. రెండు వారాల క్రితం (1.12.15 తేదికి) ఒక అబ్బాయి వచ్చి ఆమెను చూసి ఓ.కె. చేశాడు. ఇరువురికి నచ్చి వివాహానికి ఒప్పుకున్నారు. వారు త్వరలోనే వివాహం జరగాలని ప్రార్థన చేస్తున్నారు.

మా పెద్దమ్మ (అమ్మవాళ్ల అక్క కు) కిడ్నీలో రాళ్లు ఉన్నాయి. 10 సంవత్సరాల క్రితం మందులు వాడితే తగ్గుతుందన్నారు. కాని మళ్ళీ నొప్పి, వాంతులు అవుతూన్నాయి. నొప్పి భరించలేకపోతుంది. ఇక నేను బ్రతుకను అనేది. ఆమెకు ఆపరేషన్ చేయిద్దామంటే ఆమెకు 70 సంవత్సరాలు గనుక డాక్టర్ వద్దని 3 సిట్టింగ్స్‌లో స్టోన్స్ పగులగొడతామన్నారు. మొదటి సిట్టింగ్‌లో ఏమీ కాలేదు. 2వ సిట్టింగ్‌లో 20 మి.మీ ఉన్న రాయి 9 మి.మీ అయ్యింది. భోజనం చేయలేని స్థితిలో ఉన్న ఆమెపై దేవుడు కృప చూపాడు. యు.పి.ఎఫ్. పాస్టర్స్, 24 గంటల గొలుసు ప్రార్థనలో కూడ ఆమె కొరకు ప్రార్థించారు.

మా చిన్నపాపకు 3 వారాలనుండి జలుబు, దగ్గు విపరీతంగా ఉంది ఏం తిన్నా దగ్గు వల్ల వాంతులు అవుతున్నాయి. జ్వరం వచ్చి తగ్గుతూ పెరుగుతూ ఉంది. డాక్టర్ మందులు ఎక్కువగా వాడొద్దన్నారు. ఆ విషయమై 2,3 రోజులు ప్రార్థనలో పెట్టాను. దేవుడు ఆమెకు సంపూర్ణ స్వస్థత ఇచ్చాడు. అమ్మగారి వాక్యంద్వారా సమస్యల్లో నేనెంతో ధైర్యం, బలం పొందాను. ఆ వాక్యంద్వారా దేవుడు నాతో మాట్లాడాడు. దేవునికి స్తోత్రములు! అమ్మగారికి, సంఘమునకు వందనములు.

**6. మేరి, రాంనగర్ :** మా బావగారి కోడలు (సోని) వివాహమైన నెల రోజులకు నాతో యు.పి.ఎఫ్. మందిరానికి వచ్చింది. ఆ రోజు తనకు ఏ వాగ్దానం వచ్చినా విశ్వాసంతో ప్రార్థించుకుంటానని చెప్పింది. ఆ రోజు ఆమెకు "నీ సంతానాన్ని విస్తరింపజేసెదను" అనే వాగ్దానము వచ్చింది. ఇక్కడి నుండి వెళ్లిన రెండోనెల ఆరోగ్యం బాగోలేదని ఆమె హాస్పిటల్‌లో చూపించుకొంటే ప్రెగ్నెంట్ అని వచ్చింది. అప్పటినుండి సంపూర్ణరాత్రి ప్రార్థనలో ఆమెకు నార్మల్ డెలివరీ కావాలని ప్రార్థన విన్నపము ఇస్తూవచ్చాను. 24.11.15న ఆమెకు నార్మల్ డెలివరీ అయ్యింది. చిన్న కుట్టుకూడా పడలేదు. అందమైన, ఆరోగ్యకరమైన కుమార్తె జన్మించింది. దేవునికి స్తోత్రములు. అమ్మగారికి వందనములు.

**7. గోపమ్మ, రాంనగర్ :** 30.11.2015న రాత్రి 9 గంటలకు నా ఎడమకాలు, చెయ్యి పీక్కుపోయి వంకరపోయాయి. మొత్తం వేలబడినట్టు అయ్యింది. నేను వెంటనే దేవుని నామములు, 100 దైవికస్వస్థత వాగ్దానములు చదివాను. హాస్పిటల్‌కు వెళ్తే రెండు ట్యాబ్లెట్స్ ఇచ్చారు. గ్యాస్ పెరిగి శ్వాస తీసుకోలేని స్థితిలో ఉన్నాను. దేవా! నన్ను బాగుచేయి అని వాగ్దానాలు, దైవికస్వస్థత చదివాను. గ్యాస్ తగ్గుటకొరకు మరో ట్యాబ్లెట్ ఇచ్చారు. దేవా! నన్ను బాగు చేయి, నన్ను హాస్పిటల్‌లో ఉంచొద్దు, నా స్థితి ఎరిగిన దేవుడవు, నాకు మంచి ఆరోగ్యము కావాలని ప్రార్థించాను. దేవుడు నాకు అద్భుతంగా శీఘ్రస్వస్థత నిచ్చాడు. దేవునికి స్తోత్రములు. అమ్మగారికి వందనములు.

**8. సుజాత :** మా అమ్మ నెలరోజులనుండి డెంగ్యూ జ్వరం, ఇతర అనారోగ్యతల వల్ల మంచంపడితే హాస్పిటల్‌లో చేర్చాం. డెంగ్యూ అని చికిత్స చేస్తుండగా మూత్రవిసర్జన ఆగిపోయింది. యశోద హాస్పిటల్‌కు తీసికెళ్లాము. డాక్టర్స్ పరీక్షించి కిడ్నీలు పాడైనాయి. పరిస్థితి విషమంగా ఉంది. మా ప్రయత్నం మేము చేస్తాము. మీరు ఆశ వదులుకోవాలన్నారు. నేను హాస్పిటల్‌లో ఉండి 'దేవుని నామములు' పుస్తకము చదువుతూ మా అమ్మను స్వస్థపరచమని ప్రార్థించాను. ఒక కిడ్నీ డయాలసిస్ చేశారు. దేవుని కృపనుబట్టి ఆమెకు డెంగ్యూ నుండి స్వస్థతకలిగింది. 2 కిడ్నీలు పనిచేస్తున్నాయని డిశ్చార్జ్ చేస్తామన్నారు. దేవుని నామములు పూర్తిగా చదివిన తర్వాత డెంగ్యూ కంట్రోల్ అయ్యింది. కిడ్నీలు పనిచేస్తున్నాయి. దేవునికి స్తోత్రములు. అమ్మగారికి వందనములు.

**9. నిమిష, హైదరాబాద్ :** నేను 2007 వ సంవత్సరమునుండి యు.పి.ఎఫ్.కి వస్తున్నాను. నాకు 2010వ సంవత్సరంలో స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా, జబల్‌పూర్‌లో ఉద్యోగం వచ్చింది. అది దేవుని కృపయే. 2011వ సంవత్సరములో నాకు వివాహం అయ్యింది. అప్పటినుండి ట్రాన్స్‌ఫర్‌కొరకు ప్రార్థిస్తున్నాము. 2012వ సంవత్సరమునుండి ట్రాన్స్‌ఫర్ అప్లికేషన్స్ పెట్టుకున్నాను. ఆ ట్రాన్స్‌ఫర్ రావాలంటే దాని వెనుక పొలిటికల్ పవర్ ఉండాలి. నేను అలాగే 2012వ సంవత్సరమునుండి మనుష్యులను ఆశ్రయించాను. 2013వ సంవత్సరంలో దేవుని ఆశ్రయించి ప్రార్థించాను. ట్రాన్స్‌ఫర్‌కొరకు ప్రార్థిస్తుంటే దేవుడు నన్ను ఆశీర్వదించి చక్కని కుమారుని (జాయ్) అనుగ్రహించాడు. దాని వల్ల నేను 3 నెలలు మాత్రమే ఉద్యోగం చేసేదాన్ని 5 నెలలు లీవ్‌పెట్టి బాబు దగ్గర ఉండేదాన్ని. ఇలా చాలా రోజులు డిప్రెషన్‌లో ఉన్నాను. అమ్మగారికి ఎప్పుడు ఎస్.ఎం.ఎస్. చేసినా ' గాడ్ విల్ డూ వండర్స్' అని చెప్పేవారు. 12-12-13 నుండి 'భయపడకు, దేవుడు తప్పక ట్రాన్స్‌ఫర్ ఇస్తాడు. అధికారుల మనస్సు మారుస్తాడు అని చెప్పేవారు. అయినా నేను అధైర్యంగా ఉన్నాను. నేను ఏ టైంలో ఫోన్ చేసినా అమ్మగారు రిప్లై ఇచ్చేవారు. 25-9-15 న నా పుట్టిన రోజున అమ్మగారు 'నీకు ఈసారి అద్భుతం జరుగుతుంది. ట్రాన్స్‌ఫర్ వస్తుంది.' అని మెసేజ్ చేశారు. 30-9-15 న ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స్ వచ్చాయి. 7-10-15 న నాపై అధికారి కాల్ చేసి ట్రాన్స్‌ఫర్ వచ్చిందని చెప్పారు. ఈ విషయము అమ్మగారికి చెబితే అమ్మగారు ఎంతో సంతోషించారు. దేవునికే మహిమ కలుగునుగాక! మాకొరకు ప్రార్థించిన అమ్మగారికి, సంఘమునకు వందనములు.

**10. ఇందిర, ఫిర్జాదిగూడ :** 05-10-15 వ తేదీన నేను నా కుమారుడు బండిమీద వెళ్తున్నప్పుడు భయంకరమైన రోడ్డు ప్రమాదం జరిగింది. ఒక బండి స్పీడ్‌గా వచ్చి మా బండిని బలంగా ఢీ కొట్టింది, ఇద్దరం పడిపోయాం. నా కుమారుడు ప్రవీణ్‌కి మెదడులో రక్తం గడ్డకడుతుంది; ఒకరోజు అబ్జర్వేషన్ తరువాతే ఏమైనా చేస్తాం అని డాక్టర్స్ చెప్పారు. ICU లో ఉంచారు. నాకు ఇంటర్నల్‌గా దెబ్బలు తగిలినందున నన్నూ అడ్మిట్ చేసికొన్నారు. ఈ విషయం తెలిసిన నా భర్త ఆరోగ్యం క్షీణించి హాస్పిటల్‌లో అడ్మిట్ అయ్యాడు. ముందు 4 రోజులుగా అతనికి జ్వరం ఉండేది. ఇప్పుడు డెంగ్యూ జ్వరం వచ్చి ICU లో ఉన్నాడు. యాక్సిడెంట్ జరిగిన వెంటనే నా కుమార్తె మేరి విషయం అమ్మగారికి చెప్పింది. అమ్మగారు, సంఘము మాకొరకు ప్రార్థించారు. దేవుడు ప్రాణాపాయం నుండి తప్పించాడు. కుమారుని డాక్టర్స్ ఏ విషయం చెప్పలేం అన్నారు కాని అద్భుతంగా మరుసటి రోజు ఉదయం అతని మెదడుకి ఏ సమస్యలేదని చెప్పారు. నాకు ఇంతపెద్ద రోడ్డు ప్రమాదం అయినా ఒక్క ఎముక కూడా విరగకుండా దేవుడు కాపాడాడు. నడుము నొప్పి వచ్చింది. కాని ప్రార్థనలవల్ల దేవుడు స్వస్థపరచాడు. పడకబట్టకుండా దేవుడు నన్ను కాపాడాడు.

దేవుడు నా కుమారుని తలకు ఏ సమస్య కలుగకుండా కృప చూపాడు. కాని అతని కుడి చేయి కొంచెం ఫ్రాక్చర్ అయ్యింది. సర్జరీకి కావాల్సిన ఆర్థిక సహాయంకొరకు అమ్మగారు, సంఘము ప్రార్థించారు. ఇన్సూరెన్స్ విషయంలో దేవుడు ఎంతో కృప అనుగ్రహించాడు. అసలు ఇన్సూరెన్స్ వస్తుందో లేదో అనుకున్నాం. కాని అమ్మగారు, సంఘ నిరంతర ప్రార్థనలవలన మొత్తం ఇన్సూరెన్స్ వచ్చేసింది. సర్జరీ విజయవంతమైంది. ఒక్క పైస కూడ మేము కట్టలేదు.

నా భర్తకు డెంగ్యూ జ్వరంవలన ప్లేట్‌లెట్స్ కౌంట్ తక్కువ అయ్యింది. కాని ప్రార్థనద్వారా ఆయనకు త్వరగా స్వస్థత వచ్చింది. నా కుమార్తెకు కూడా డెంగ్యూ

జ్వరం వచ్చి ప్లేట్‌లెట్స్ కౌంట్ తగ్గిపోయింది. 3 రోజుల్లో తాను స్వస్థపడుటకు దేవుడు కృప చూపాడు. మా కుటుంబాన్నంతటిని సజీవుల లెక్కలో ఉంచి ఆయన సన్నిధిలో సాక్షులుగా ఉంచిన దేవునికి స్తోత్రము.! మాకొరకు భారంగా ప్రార్థించిన అమ్మగారికి, సంఘమునకు వందనములు.

**11. మణెమ్మ, TRT క్వార్టర్స్, విద్యానగర్ :-** మా బంధువుల అమ్మాయి పేరు మౌనిక (20 సం॥లు) ఆమె మొదటిసారి గర్భముతో ఉన్నప్పుడు పరిస్థితి బాగోలేదు. ప్రార్థించినప్పుడు ఆపరేషన్‌ద్వారా పాప జన్మించింది. ఇద్దరు ఆరోగ్యంతో ఉన్నారు. 2 వ సారి గర్భముతో ఉన్నప్పుడు 7వ నెల చివరినుండి 10 రోజులుగా ఆమెకు ఉమ్మనీరు పోతుంది. హాస్పిటల్‌లో చూపిస్తే ఆపరేషన్ చేసి బిడ్డను తీస్తాం గాని బిడ్డ బ్రతుకుతుందని చెప్పలేం తల్లీ బిడ్డలిద్దరికీ ప్రమాదం ఉందని చెప్పారు. అప్పుడు యు.పి.ఎఫ్. శుక్రవార ప్రార్థనలో యు.పి.ఎఫ్. పాస్టర్, సంఘము ఏకీభవించి ప్రార్థించారు. వారు విజయవాడ వెళ్లి ట్రీట్‌మెంట్ తీసికుంటుండగ నొప్పులు ఎక్కువగా వచ్చి నార్మల్‌గా డెలివరీ అయ్యింది. కుమారుడు జన్మించాడు. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారు. దేవునికి స్తోత్రములు.! అమ్మగారికి వందనములు.

**12. రూతు, రాంనగర్ :** నా కుమార్తె 9 నెలల గర్భంతో ఉంది. 23-10-2015 న రాత్రంతా కడుపు నొప్పితో బాధపడింది. ఉదయం 5 గం॥లకు ఆసుపత్రికి తీసికొని వెళ్ళాలని ప్రయత్నిస్తే సహాయం లభించలేదు. ఆ సమయంలో ఆటోలు కూడా లేవు. సహాయంకొరకు దేవుని ప్రార్థిస్తే ఒక ఆటో దొరికింది. ఆటోలో కూర్చొని యు.పి.ఎఫ్. సంఘమునకు ఫోన్ చేసి ప్రార్థన చేయించుకున్నాను. వైద్యులు ఇచ్చిన డెలివరీ తేదీకి ఇంకా 3 రోజుల టైం ఉంది. 3 ఇంజెక్షన్స్ ఇచ్చారు. అయినా నార్మల్ డెలివరీ కావడంలేదు. ఆపరేషన్ చేయాలని వైద్యులు చెప్పారు. నా దగ్గర ఆపరేషన్‌కొరకు డబ్బులేదు. నార్మల్ డెలివరీ కావాలని ప్రార్థించాను.దేవుని కృపనుబట్టి నార్మల్ డెలివరీ అయ్యింది. బాబు పుట్టాడు. బరువు 1½ కిలోలు మాత్రమే ఉన్నాడు. కాని ఇప్పుడు బాబు బాగుపడ్డాడు. దేవునికి స్తోత్రములు.! అమ్మగారికి వందనములు.

**13. మీనాకుమారి :** నాకు యూట్రస్ సమస్య ఉండేది. అమ్మగారికి చెప్పినప్పుడు అమ్మగారు నా పొట్టపై చెయ్యిపెట్టి ప్రార్థించారు. దేవుడు అద్భుతంగా యూట్రస్ సమస్యనుండి విడదల ఇచ్చి స్వస్థపరచాడు. షుగర్ నార్మల్ అగుటకు కృప చూపాడు. దేవునికి స్తోత్రములు. అమ్మగారికి వందనములు.

**14. వినోద :** నాకు 2 సంవత్సరములనుండి ఆరోగ్యం బాగోలేదు. 2 సంవత్సరాలుగా ఎన్ని ప్రయత్నాలు చేసినా నాకు స్వస్థత కలుగలేదు. ఎంతమంది డాక్టర్స్‌ను కలిసినా కూడా ఫలితం కలుగలేదు. అమ్మగారిని కలిసిన వెంటనే నాకు ఎంతో మేలు జరిగింది. అమ్మగారు నాపై ఎంతో శ్రద్ధ చూపించారు, సహాయం చేశారు. అమ్మగారి ప్రార్థనద్వారా స్వస్థత కలిగింది. దేవునికి స్తోత్రములు! అమ్మగారికి వందనములు.

**15. ఫార్చ్యూనా శాంతి :** సెప్టెంబర్ 2015లో నా తోడికోడలు ఎంతో అస్వస్థతకు గురైంది. షుగర్ 500, బి.పి 70 ఉంది. డాక్టర్ గంట మాత్రమే బ్రతికే అవకాశం ఉందన్నారు. అమ్మగారికి రిక్వెస్ట్ చెబితే అమ్మగారు ప్రార్థించారు. ప్రార్థన గోపురంలో తెలియజేశారు. గంట మాత్రమే బ్రతుకుతుందని చెప్పిన వైద్యులు అమ్మగారు ప్రార్థించిన పిదప 24 గంటలు బ్రతుకుతుందని చెప్పారు. దేవుడు అద్భుతకార్యం చేశాడు. ఆమెను పూర్తిగా బాగు చేశాడు. 10-10-15 నుండి. ఆమె తన ఉద్యోగానికికూడా వెళ్తుంది. దేవునికి సోత్త్రములు! ప్రార్థించిన అమ్మగారికి వందనములు.

**16. సుమలత, నిజామాబాద్ :** నేను 'ఎక్స్ఛేంజ్ డిపార్ట్‌మెంట్' పరీక్ష వ్రాయుటకు ముందు అమ్మగారి దగ్గరకు వచ్చి ప్రార్థన చేయించుకొని వెళ్ళాను. దేవుని కృప, అమ్మగారి ప్రార్థనలవల్ల ఎగ్జామ్ బాగా వ్రాశాను. క్వాలిఫై అగుటకు దేవుడు కృప చూపాడు. సంవత్సరం తర్వాత పోస్టింగ్ ఇచ్చారు. దేవుడు అద్భుతంగా నా హృదయవాంఛ తీర్చి ఎక్స్ఛేంజ్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం అనుగ్రహించాడు. నేను ప్రార్థనలో అడిగింది దేవుడు నాకు అనుగ్రహించాడు. దేవునికి స్తోత్రములు! అమ్మగారికి వందనములు.

**17. రెబెకా, డి.డి.కాలనీ :** నాకు 3 సంవత్సరముల నుండి నడుమునొప్పి ఉంది. హాస్పిటల్‌కు వెళ్తే మందులు వ్రాశారు. స్కానింగ్, ఎక్స్‌రే తీయించమన్నారు. పని చేయొద్దన్నారు. కాని ప్రార్థనద్వారా దేవుడు గొప్ప మేలు చేశాడు. అమ్మగారి ప్రార్థనద్వారా స్వస్థత కలుగుతుందని విశ్వసించాను. 16.11.15, సోమవారం 'తల్లుల ప్రార్థన'కు వద్దామంటే ఎన్నో ఆటంకాలు వచ్చాయి. కాని దేవుడు నన్ను ఆ రోజు తల్లుల ప్రార్థనకు నడిపించాడు. ఆ రోజు 'యెరూషలేము కుమార్తెలారా మీరు నా నిమిత్తం కాదు; మీ నిమిత్తం మీ పిల్లల నిమిత్తం ఏడ్వండి' అనే వాక్యం చెప్పారు. కూర్చున్నంతసేపు నడుము నొప్పిగానే ఉంది. ఏమీ వశపడడం లేదు. తర్వాత అమ్మగారి దగ్గర ప్రార్థనకు మోకరించినప్పుడు అమ్మగారు నడుంపై చెయ్యిపెట్టి నూనె రాసి ప్రార్థించారు. అమ్మగారు నడుముపై రుద్దుతున్నప్పుడు ఏదో బలమైన హస్తం తగిలినట్లు అయ్యింది. ఆ రోజు నుండి నా నడుం నొప్పి ఎటుపోయిందో తెలియదు. దేవుడు నాపై కనికరం చూపి అమ్మగారి హస్తంతో తాకి స్వస్థతనిచ్చాడు. నాకు ఎప్పుడు వెనకాల బరువుగా ఉంటుండెను. ఆ బరువంతా వెంటనే తేలికైపోయింది. దేవునికి స్తోత్రములు. అమ్మగారికి నా వందనములు.

**18. మేరి, వికారాబాద్ :** మాకు ఒక పాప, ఒక బాబు (7 సం॥లు) బాబు పుట్టిన కొంత కాలం తర్వాత నుండి 6 సంవత్సరములు నాకు పీరియడ్స్ రాలేదు. 6 సంవత్సరాల తర్వాత తీవ్రంగా రక్తస్రావం అవుతుంటే మెనోపాజ్ అనుకున్నాను. డాక్టర్స్‌కు చూపించుకుంటే స్కానింగ్, ఇతర పరీక్షలు చేసి యూట్రస్ సమస్య ఉంది. యూట్రస్ తీసివేయాలన్నారు. దానికి రూ॥ 60,000/- ఖర్చు అవుతుందన్నారు. నాకు తీవ్రంగా రక్తస్రావం అయ్యేది. నేను యూట్రస్ సమస్యతో బాధపడుతూ నా భర్తతో కలిసి యు.పి.ఎఫ్.కు వచ్చాను. అమ్మగారు నా కొరకు భారంగా ప్రార్థించారు. 5 నెలల నుండి (20.12.15 తేదీకి) యు.పి.ఎఫ్.కు వస్తున్నాను. దేవుడు నా జీవితంలో అద్భుతకార్యం చేశాడు. ఇప్పుడు యూట్రస్ సమస్యపోయి నేను 5 నెలల గర్భిణిని అని తెలిసింది. దేవునికి స్తోత్రములు, అమ్మగారికి వందనములు.

"నా నామమున మీరు నన్నేమి అడిగినను నేను చేతును." - యోహాను 14:14

**యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ (UPF) నిర్వహించు**

## సంపూర్ణ రాత్రి ప్రార్థన

**అందరికీ ఆహ్వానము**

**తేది : 24 ఫిబ్రవరి 2016 (బుధవారం)**

**సమయము : రా॥ 9 గం॥ల నుండి ఉ॥ 5 గం॥ల వరకు**

**స్థలము : సెంటినరి బాప్టిస్ట్ చర్చ్, క్లాక్ టవర్ దగ్గర, సికింద్రాబాద్.**

## యు.పి.ఎఫ్. ఇతర సేవా కార్యక్రమాలు

- ప్రతి ఆదివారము **"ప్రభాత ఆరాధన"** ఉదయము 6.00గం॥ల నుండి 9.00గం॥ల వరకు.
  స్థలము : యు.పి.ఎఫ్., రాంనగర్ విలాసములో
- ప్రతి ఆదివారము **"సాయంకాల ఆరాధన"** సాయంత్రం 5.00గం॥ల నుండి రాత్రి 8.30 ని॥ల వరకు.
  స్థలము : ఉస్మానియా గార్డెన్ ఫంక్షన్ హాల్, జామై ఉస్మానియా రైల్వే స్టేషన్ ఎదురుగా, అడిక్‌మెట్, హైదరాబాద్ - 500 044.
- ప్రతి ఆదివారము **"సండే స్కూల్"** ఉ॥ 7.00గం॥ల నుండి 9.00గం॥ల వరకు. (స్థలము : యు.పి.ఎఫ్. విలాసములో)
- ప్రతి సోమవారము **"ఉదయకాల ప్రార్థన"** ఉ॥ 4 గం॥ల నుండి 7 గం॥ల వరకు.
- ప్రతి సోమవారము **"మెన్స్ ప్రేయర్ ఫెలోషిప్"** సాయంత్రం 6.00 గం॥ల నుండి 9.00 గం॥ల వరకు.
- ప్రతి సోమవారము **"తల్లుల ప్రార్థన సహవాసము"** సా॥ 6 గం.ల నుండి రా॥ 8.30 ని.ల వరకు.
- ప్రతి మంగళవారము **"దేవుని వెయ్యి నామములు"** ఉ॥ 10.00 గం॥ల నుండి మ॥ 1.00 గంట వరకు.
- ప్రతి మంగళవారము **"యౌవన స్త్రీల సహవాసము"** (YWF) సా॥ 6.00 గం॥ల నుండి రాత్రి 8.30 ని॥ల వరకు.
- ప్రతి బుధవారము **"బైబిల్ కాలేజి తరగతులు"** సా॥ 6.00 గం॥ల నుండి రాత్రి 9.00 గం॥ల వరకు.
- ప్రతి గురువారము **"ప్రకటన గ్రంథ వ్యాఖ్యానము"** సాయంత్రం 6.00 గం॥ల నుండి రాత్రి 9.00 గం॥ల వరకు.
- ప్రతి శుక్రవారము **"ఉపవాస ప్రార్థన"** ఉ॥ 10.00 గం॥ల నుండి మ॥ 1 గం॥ వరకు మరియు సా॥ 5.00 గం॥ల నుండి రాత్రి 8.30 ని॥ల వరకు. **రోగుల కొరకు ప్రత్యేక ప్రార్థనలు చేయబడును.**
- ప్రతి శనివారము **"వృద్ధుల సహవాసము"** మ॥ 2.00 గం॥ల నుండి సాయంత్రం 5.00 గం॥ల వరకు. **"యౌవన పురుషుల సహవాసము"** సా॥ 6.00 గం॥ల నుండి రాత్రి 8.30 ని॥ల వరకు.
- ప్రతి నెల రెండవ శనివారము **"ప్రత్యేక ఉపవాస ప్రార్థన"** ఉ॥ 10.00 గం॥ల నుండి సా॥ 5.00 గం॥ల వరకు
  స్థలము:యు.పి.ఎఫ్., రాంనగర్ విలాసములో
- ప్రతి నెల ఆఖరి బుధవారము **"సంపూర్ణ రాత్రి పార్థన"** రాత్రి 9.00 గం॥ల నుండి ఉ॥ 5.00 గం॥ల వరకు
  **స్థలము: సెంటినరి బాప్టిస్ట్ చర్చ్, సికింద్రాబాద్.**
- ప్రతి రోజు ఉదయము 5.00 గం॥ల నుండి రాత్రి 9.00 గం॥ల వరకు మందిరము తెరచి ఉంచబడును. వ్యక్తిగతముగా ఆలయములో ప్రార్థనలు చేసుకొనవచ్చును. అవసరతల చొప్పున గృహ కూడికలు, గృహ సందర్శనములు, రోగుల కొరకు ప్రార్థనలు జరుపబడును.

## పుస్తకములు & సి.డి. పరిచర్య

జాయ్ చెరియన్ గారు ప్రసంగించిన ప్రసంగములు సి.డి. రూపములో మీకు అందుబాటులో ఉన్నవి. యు.పి.ఎఫ్. ఆఫీసులో మీకు లభ్యమగును.

పోస్టుద్వారా పుస్తకములు కావలసినవారు పుస్తకాల వెలతోపాటు పోస్టల్ ఛార్జి అధనంగా యం.ఓ. ద్వారా పంపగలరు.

| | |
|---|---|
| **దేవుని వెయ్యి ఆదేశములు (1-300) (సి.డి.)** | **వెల రూ. 30/-** |
| **మీ హృదయము కలవరపడనియ్యకుడి (వి.సి.డి.)** | **వెల రూ. 30/-** |
| **నా ప్రాణ ప్రియుడు (వి.సి.డి. & సి.డి.)** | **వెల రూ. 30/-** |
| **నూతన సంవత్సర తీర్మాణములు (వి.సి.డి.)** | **వెల రూ. 30/-** |
| **క్రిస్మస్ వేడుకలు (డి.వి.డి.)** | **వెల రూ. 30/-** |
| **కాపరి లక్షణములు (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **తల్లులకు హెచ్చరికలు (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **విశ్వాసి యాత్ర కీర్తనలు (MP3)** | **వెల రూ. 40/-** |
| **దేవుడు కోరునది (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **ఆశీర్వాదమునకు రహస్యము విధేయత (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **ప్రార్థన అవసరత దీవెన (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **దేవునికి ఇచ్చుటలో దీవెన (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **గుణవతియైన స్త్రీ (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **దేవుని వెయ్యి నామములు (MP3)** | **వెల రూ. 40/-** |
| **నిన్ను విడువను నిన్ను ఎడబాయను (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **నూతన సంవత్సరము - విడుదలబాటు (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **జ్ఞానవంతురాలు (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **శుభకరమైన ఆనవాలు (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **విశ్వాసురాలైన తల్లి (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **సిలువ ధ్యాన కీర్తనలు (MP3)** | **వెల రూ. 40/-** |
| **దేవుని యొద్దనుండి ఒక మాట (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **నన్నాశ్రయించుడి, నన్నాశ్రయించినయెడల మీరు బ్రతుకుదురు (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **సంఘ పరిచర్యలో స్త్రీలు (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **మీరు లోకమునకు వెలుగైయున్నారు (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **క్రొత్త మనస్సు (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **క్రైస్తవ కుటుంబము (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **పరలోక రాజ్యము యొక్క తాళపు చెవులు (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **బలిపీఠం మీద నిత్యం అగ్ని మండుచుండవలెను... (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **స్త్రీలు - పరిశుద్ధత, పరిశుభ్రత (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **ప్రభువా! నాకు సహాయము చేయుము (వి.సి.డి.)** | **వెల రూ. 40/-** |
| **స్త్రీలు మౌనముగా ఉండవలెనా? 1 & 2 (వి.సి.డి.)** | **వెల రూ. 50/-** |
| **హృదయపరీక్ష (MP3)** | **వెల రూ. 60/-** |
| **సంగీతముతో కూడిన 1000 దేవుని నామములు (సి.డి.)** | **వెల రూ. 100/-** |
| **సంగీతముతో కూడిన 1000 దేవుని వాగ్దానములు (సి.డి.)** | **వెల రూ. 100/-** |

**ఈ క్రింది పుస్తకములు కావలసినవారు మా చిరునామాను సంప్రదించండి :**

| | |
|---|---|
| **"దేవుని వెయ్యి నామములు" - Vol - I**<br>1-100 ప్రసంగాల పుస్తకము (తెలుగు) | **వెల రూ. 100/-** |
| **"దేవుని వెయ్యి నామములు" - Vol - II**<br>101-200 ప్రసంగాల పుస్తకము (తెలుగు) | **వెల రూ. 100/-** |
| **"దేవుని వెయ్యి నామములు" - Vol - III**<br>201-300 ప్రసంగాల పుస్తకము (తెలుగు) | **వెల రూ. 100/-** |
| **"దేవుని వెయ్యి నామములు" - Vol - IV**<br>301-400 ప్రసంగాల పుస్తకము (తెలుగు) | **వెల రూ. 100/-** |
| **"దేవుని వెయ్యి నామములు" - Vol - V**<br>401-500 ప్రసంగాల పుస్తకము (తెలుగు) | **వెల రూ. 100/-** |
| **"దేవుని వెయ్యి నామములు" - Vol - VI**<br>501-600 ప్రసంగాల పుస్తకము (తెలుగు) | **వెల రూ. 100/-** |
| **"దేవుని వెయ్యి నామములు" - Vol - VII**<br>601-700 ప్రసంగాల పుస్తకము (తెలుగు) | **వెల రూ. 100/-** |
| **"దేవుని వెయ్యి వాగ్దానములు" - Vol - I** | **వెల రూ. 100/-** |
| **"దేవుని వెయ్యి ఆదేశములు" - Vol - I**<br>1-100 ప్రసంగాల పుస్తకము (తెలుగు) | **వెల రూ. 100/-** |
| **"హృదయ పరీక్ష"** 40 ప్రసంగాల పుస్తకము (తెలుగు) | **వెల రూ. 150/-** |
| **"అద్భుత కార్యములు" - Vol - I** | **వెల రూ. 100/-** |
| **"అద్భుత కార్యములు" - Vol - II** | **వెల రూ. 100/-** |
| **"విశ్వాసి యాత్ర కీర్తనలు"** (1000 పాటలు) | **వెల రూ. 120/-** |
| **"దైవిక స్వస్థత" పుస్తకము** (తెలుగు) | **వెల రూ. 10/-** |
| **"నన్ను మలిచిన నా దేవుడు"** జాయ్ చెరియన్‌గారి అనుభవసాక్ష్యము(తెలుగు) | **వెల రూ.10/-** |
| **"పక్షిరాజు" పుస్తకము** (తెలుగు) | **వెల రూ. 10/-** |
| **"రహస్య పాపములు" పుస్తకము** (తెలుగు) | **వెల రూ. 10/-** |
| **"వెయ్యి నామములు" పుస్తకము** (ఇంగ్లీషు, తెలుగు&హిందీ) | **వెల రూ. 10/-** |
| **"అమ్మ మాటలు" పుస్తకము** (తెలుగు) | **వెల రూ. 10/-** |
| **"మండుచున్న కాగడ" పుస్తకము** (దేవుని పరిచర్యలో స్త్రీలు)(తెలుగు) | **వెల రూ. 10/-** |
| **"వెయ్యి వాగ్దానములు" పుస్తకము** (ఇంగ్లీషు మరియు తెలుగు) | **వెల రూ. 10/-** |
| **"వెయ్యి ఆదేశములు" పుస్తకము** (ఇంగ్లీషు మరియు తెలుగు) | **వెల రూ. 10/-** |
| **"2016 సం॥ క్యాలెండరు"** (తెలుగు మరియు ఇంగ్లీషు) | **వెల రూ. 50/-** |

RNI. No. APTEL 2007/24270



**మీకు మీ సెల్‌లో ప్రతి రోజు దేవుని వాక్యము కావలెనా?**

ప్రతి రోజు దేవుని వాగ్దానము SMS మీ సెల్‌ఫోన్‌లో పొందాలంటే ఈ ఫారమ్ పూర్తి చేసి ఈ దిగువ నున్న అడ్రస్ కు పంపండి. ఒక్క ఫారమ్ ఒక్క నెంబర్‌కే పరిమితం.

## యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్
## UNITED PEOPLE'S FELLOWSHIP (UPF)

# 1-9-52/E/3, Ramnagar, Hyderabad - 500 020. Phone : **27624030/1**

Name / పేరు: ______________________

Address
చిరునామా : ______________________

______________________

______________________ PIN : [ ][ ][ ][ ][ ][ ]

Your Church Name
మీ సంఘము పేరు : ______________________

Mobile Number for SMS subscription / SMS సభ్యత్వం కొరకు సెల్ నంబర్

[ ][ ][ ][ ][ ][ ][ ][ ][ ][ ]

Date : ..................................................
Signature

ప్రార్థించండి! **ప్రకటన** పాల్గొనండి!

## యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ (UPF)

**1-9-52/E/3, రాంనగర్, హైదరాబాద్-20.**
**Ph : 040-27624030, 27624031**

**ప్రతి ఆదివారము**

## ఉదయకాల ఆరాధన

ఉ॥ 6 గం॥ల నుండి ఉ॥ 9 గం॥ల వరకు

స్థలము : యు.పి.ఎఫ్., రాంనగర్ విలాసములో

మరియు

## సాయంకాల ఆరాధన

**సా॥ 5 గం॥ల నుండి రాత్రి గం॥ 8.30 ని॥ల వరకు**

స్థలము : ఉస్మానియా గార్డెన్ ఫంక్షన్ హాల్,
జామై ఉస్మానియా రైల్వే స్టేషన్ ఎదురుగా, అడిక్‌మెట్,
హైదరాబాద్ - 500 044. తెలంగాణ.

**అందరికీ ఆహ్వానము** - జాయ్ చెరియన్

**యు.పి.ఎఫ్. ఆధ్యాత్మిక టి.వి. కార్యక్రమము**

# "జీవపు మాటలు"

**ఆరాధన** ఛానెల్‌లో
ప్రతి రోజు మ॥ 2.00 గం॥లకు

**రక్షణ** ఛానెల్‌లో
ప్రతి రోజు ఉ॥ 6.00 గం॥లకు

**మెట్రో** ఛానెల్‌లో (హాత్‌వే నెం. 19)
ప్రతి రోజు రాత్రి 8.00 గం॥లకు మరియు
ప్రతి సోమవారము ఉ॥ 7.00 గం॥లకు

**కల్వరి** ఛానెల్‌లో
ప్రతి రోజు ఉ॥ 5.30 గం॥లకు మరియు ఉ॥ 10.00 గం॥లకు

**శుభవార్త** ఛానెల్‌లో
ప్రతి శుక్రవారము మ॥ 2.30 ని॥లకు

**గాస్పెల్** ఛానెల్‌లో
ప్రతి రోజు ఉ॥ 10.30 ని॥లకు మరియు రా॥ 7.00 గం॥లకు

జాయ్ చెరియన్ గారు దైవ వర్తమానమును అందించెదరు. వీక్షించి, దైవాశీర్వాదము పొందండి. ఈ కార్యక్రమము కొనసాగించుటకు ప్రార్థించండి, సహకరించండి.

ప్రభు సేవలో
– జాయ్ చెరియన్

మా చిరునామా :

## యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ (UPF)

**# 1-9-52/E/3, రాంనగర్ ఈ-సేవ కు ఎదురుగా ఉన్న గౌతమ్ హైస్కూల్ వీధి, మూడవ కుడి మలుపు, రాంనగర్, హైదరాబాద్-20.**
**ఫోన్ : 040-27624030, 27624031**

***VISIT US AT :***
***Email : joycherian@hotmail.com,***
**www. unitedpeoplesfellowship.org**

ఆడియో ద్వారా ప్రసంగాలు వినాలన్నా, దేవుని వెయ్యినామముల ప్రసంగములు మీరు ఇంగ్లీషు భాషలో చదువవలెనన్నా, మా వెబ్‌సైట్‌ను దర్శించండి

**www.unitedpeoplesfellowship.org**

**Owned, Edited, Printed & Published by : JOY CHERIAN, United People's Fellowship,**
**# 1-9-52/E/3, Opp. Ramnagar e-seva Gowtham High School Lane, Third Right Turn,**
**Ramnagar, Hyderabad - 500 020, (T.S.), INDIA. Ph : 040-27624030, 27624031**
Printed at : Sandhya Printing Works, # 1-7-1002/7/4/8, Ramnagar 'X' Road, Hyderabad - 500 020. Ph : 27619862

This document was created with Win2PDF available at http://www.win2pdf.com.
The unregistered version of Win2PDF is for evaluation or non-commercial use only.
This page will not be added after purchasing Win2PDF.